తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 151

ఆదివారం | 02, నవంబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## 3నుంచి మెట్రో వేళల్లో మార్పులు



**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):** ఈ నెల 3 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అన్ని టెర్మినల్స్‌లో అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం ఉంటుందని మెట్రో రైలు యాజమాన్యం తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో రైలు వేళలు గమనిస్తే.. సోమవారం నుంచి శుక్రవారం: ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.45 వరకు., శనివారం: ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు., ఆదివారం: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు. సర్వీసులు అందుబాటులో ఉంటాయి.



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- కెనడా, ఫ్రాన్స్ ప్రతినిధులకు సీఎం వినతి

**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్

మిగతా.. 2లో

## అహనా పెళ్ళంట సీన్ బిఆర్ఎస్‌దే

- నిరుద్యోగులకు ఆశ చూపి పదేళ్ళు భోగం
- ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా నడిపిన చరిత్ర
- బిఆర్ఎస్,బిజెపిలది లోపాయకారి ఒప్పందం
- కెటిఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పిసిసి చీఫ్



**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):**

అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని కౌంటర్ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చారు.సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి.. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని దుయ్యబట్టారు. ఈమేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని

మిగతా.. 2లో



## రేవంత్ రెడ్డి బెదిరింపు రాజకీయాలకు భయపడేది లేదు

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పతనం ఖాయం
- రేవంత్ నకిలీ వాగ్దానాలు, బెదిరింపు రాజకీయాలు జూబ్లీహిల్స్ ఓటమితోనే అంతమవుతాయి
- జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోతే, 500 రోజుల్లో కేసీఆర్ తిరిగి సీఎం అవుతారు- కేటీఆర్
- గతంలో ఎంతో మంది నియంతలు పతనమయ్యారు.. తర్వాత రేవంతే
- జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ గెలవబోతోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నవంబర్1 (అక్షరగళం):**

రేవంత్ రెడ్డి బెదిరింపులకు ఎవరూ భయపడరని తేల్చిచెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని రహమత్‌నగర్ డివిజన్లో నిర్వహించిన భారీ రోడ్‌షోలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ బెదిరింపులకు తెలంగాణ ప్రజలు తలవంచరని ఆయన స్పష్టం చేశారు.సంక్షేమ పథకాలు రద్దు చేయాలని చూస్తే, ఇదే జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడ తారని హెచ్చరించారు. రేవంత్‌లాగా ఎగిరిపడు తున్న ఎంతో మంది నియంతలు పతనమ య్యారని.. దీనికి రేవంత్ రెడ్డి కూడా మినహా యింపు కాదని తేల్చిచెప్పారు. ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఎవరైనా కాంగ్రెస్ నేతలు ప్రజలను భయపెడితే.. తెలంగాణ భవన్ ఎల్లప్పుడూ తెరిచే ఉంటుందని హామీ ఇచ్చిన కేటీఆర్.. వారి సంగతి తాము చూసుకుంటా మని భరోసా ఇచ్చారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ విజయం ఖాయమైపోయిందని అన్నారు కేటీఆర్. ఇప్పటి వరకు వచ్చిన సర్వేలన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో వచ్చిన దానికంటే రెట్టింపు మెజార్టీ రాబోతోందని వెల్లడించారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం గోపినాథ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కొన్ని కోట్ల విలువైన భూమిని కాపాడటంలో గోపినాథ్ కృషి మరువలేనిదని చెప్పారు.

మిగతా.. 2లో

## కారు షెడ్డుకు పోయింది

- సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్
- కేంద్ర మంత్రిగా ఉండి కిషన్ రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదు?
- బిల్లా రంగాలు ఆటోలలో తిరిగి మిమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు
- బోరబండ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్1 (అక్షరగళం):**

గత ఎన్నికల్లో అజారుద్దీన్ ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని మాట ఇచ్చాం. జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్ ను మంత్రి పదవి ఇచ్చి మీ ముందుకు తీసుకొచ్చా.

కారు షెడ్డుకు పోయిందని బిల్లా రంగాలు ఆటోలలో తిరిగి మిమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఇవాళ కొత్తగా జూబ్లీహిల్స్ లో సమస్యలు వచ్చినట్టు మాట్లాడుతున్నారు. సెంటిమెంట్ పేరుతో ఓట్లు దండుకోవాలని మీ ముందుకు వస్తున్నారు. 2007 లో పీజేఆర్ ఆకస్మికంగా చనిపోతే ఏకగ్రీవంగా చేయాలంటే అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన దుర్మార్గుడు కెసీఆర్. పేదలను ఆదుకున్న చరిత్ర పీజేఆర్ ది.

ఇక్కడి బస్తీల్లో ఏ తలుపు తట్టినా పీజేఆర్ సాయం పొందినవారే ఉంటారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆరెస్ ఈ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదు? ఈ పరిస్థితికి కారణం మీరు కాదా? ఇప్పుడు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని కల్లబొల్లి మాటలు చెప్తే ఇక్కడి జనం నమ్మరు. మాయమాటలు చెప్పే మీలాంటి వాళ్లకు ఇక్కడి ప్రజలు బుద్ధి చెప్తారు.అందరికీ రేషన్ కార్డులు ఇచ్చింది కాంగ్రెస్ కాదా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చి మిమ్మల్ని ఆదుకున్నది కాంగ్రెస్ కాదా? ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ సన్నబియ్యం ఇస్తున్నాం. ఆడబిడ్డ లకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది నిజం కాదా? ఉచిత బస్సు రద్దు చేయాలని బీఆరెసోళ్లు మాట్లాడుతున్నారు. ఇదీ వాళ్ల గలీజ్ బుద్ధి. 2014 నుంచి వాళ్లు ఒక్క ఆడబిడ్డకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదు. మా ప్రభుత్వంలో సీతక్క, కొండా సురేఖను మంత్రి పదవులు ఇచ్చాం. శిల్పారామం దగ్గర మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాల్స్ ఇచ్చాం. మున్సిపల్ మంత్రిగా ఉండి కూడా కేటీఆర్ మీ సమస్యలు పరిష్కరించలేదు.

బీజేపీ కిషన్ రెడ్డి ఇవాళ కొత్తగా సమస్యలు ఉన్నట్టు మాట్లాడు తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి కేంద్ర మంత్రిగా ఉండి కిషన్ రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదు? బోరబండకు వచ్చి ఎందుకు సమస్యలు పరిష్కరించలేదు?బీజేపీ, బీఆరెస్‌ది ఫెవికాల్ బంధం.

ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని

మిగతా.. 2లో

## కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట

- 9 మంది భక్తులు మృతి
- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం
- స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట
- ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు
- 9మంది మృతి..పలువురికి గాయాలు
- క్షతగాత్రలను ఆస్పత్రికి తరలించి చికిత్స
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు
- కాశీబుగ్గకు చేరుకున్న మంత్రి అచ్చన్నాయుడు



**శ్రీకాకుళం, నవంబర్1 (అక్షరగళం):**

శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన

మిగతా.. 2లో

### కాశీబుగ్గ మృతుల కుటుంబాకు లోకేశ్ పరామర్శ

- ఒక్కో కుటుంబానికి 15లక్షల పరిహారం ప్రకటన
- క్షతగాత్రులకు 3లక్షల చొప్పన అందిస్తామని హామీ

**శ్రీకాకుళం,నవంబర్ 1(అక్షరగళం):** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల

మిగతా.. 2లో





## కృత్రిమ మేధ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

- మానవమేధస్సుకు అది సరితూగేది కానేకాదు
- సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రచారం తగదు
- రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులు
- అమరావతి రాజధాని రైతుల పోరాటం అద్వితీయం
- విట్ స్నాతకోత్సవంలో విశ్రాంత జస్టిస్ ఎన్‌వి రమణ

**అమరావతి,నవంబర్ 1(అక్షరగళం):**


కృత్రిమ మేధ వంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో న్యాయమూర్తులు ఒత్తిళు ,, వేధింపులు ఎదుర్కొన్నారని... కొందరు బదిలీ అయ్యారని, సంబంధం లేకపోయినా రాజకీయ కుట్రలకు బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. బాధ్యతగా పని చేయటం కూడా కొన్నిసార్లు వ్యక్తిగతమైన బాధగా మిగిలిపోతుందన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన రైతులకు న్యాయం చేసే క్రమంలో న్యాయమూర్తులు కూడా ఇబ్బందులకు గురయ్యారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అలాంటి క్లిష్ట సందర్భాల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేశారని గుర్తు చేశారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ..

మిగతా.. 2లో

## 3 నుంచి నిరవధికంగా కాలేజీల బంద్

- ఫీజు రియంబర్స్‌మెంట్‌పై యాజమాన్యాల అల్టిమేటం

**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):** ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులపై ప్రభుత్వం ఆదివారం అంటే 2వతేదీలోగా నిర్ణయం తీసుకోక పోతే.. ఈ నెల 3 నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ పాటిస్తామని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్





మిగతా.. 2లో

## క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్

- వీఎఫ్ఎక్స్, గేమింగ్ అభివృద్ధికి 'కో క్రియేటర్'గా ప్రభుత్వం
- రండి... ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేద్దాం
- "ఇండియాజాయ్ 2025" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):**

హైదరాబాద్ కేవలం "ఐటీ రాజధాని"గా మాత్రమే కాదు, భారతదేశపు "క్రియేటివిటీ హబ్"గానూ తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్(టీవీఏజీఏ) సంయుక్తాధ్వర్యంలో హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీలో రెండ్రోజుల పాటు "ఇండియాజాయ్ 2025" పేరిట నిర్వహించనున్న "ఇండియాస్ ప్రీమియర్

మిగతా.. 2లో





## వరదల నష్టాన్ని అంచనా వేసి పంపండి

- కలెక్టర్లను ఆదేశించిన సిఎస్



**హైదరాబాద్,నవంబర్ 1(అక్షరగళం):**

ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో నేడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్‌కు

మిగతా.. 2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం

# దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ

**అత్యంత దుర్భర పేదరిక నిర్మూలన**

**వివిధ కార్యక్రమాల ద్వారా దీనిని సాధించాం**

**కేరళ అవతరణ దినోత్సవం సందర్భంగా సిఎం ప్రకటన**

**అసెంబ్లీలో విజయన్ ప్రకటన...నిరసనగా విపక్షం వాకౌట్**



**తిరువనంతపురం,నవంబర్1(అక్షరగళం):** దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 21,263 మందికి మొదటిసారిగా రేషన్ కార్డులు, ఆధార్, పెన్షన్లు వంటి ముఖ్యమైన పత్రాలు మంజూరు చేసిందని తెలిపారు. 4,394 కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించామన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు నివాసం, విద్య, వైద్యం అందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రం అత్యంత దుర్భర పేదరికం నుంచి బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ నేతృత్వం లోని ప్రతిపక్షాలు పినరయి విజయన్ ప్రకటనను తప్పుబట్టాయి. ప్రభుత్వం తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించాయి. ప్రతిపక్ష నేత సతీశన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన భారీ మోసం అని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. నవంబర్ 1న కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం శాసనసభలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఓ చారిత్రాత్మక ప్రకటన చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300 నిబంధన కింద కేరళను తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సందర్భంగా విజయన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'ఒక శతాబ్దం క్రితం జరిగిన జాతీయోద్యమం నుంచి పుట్టుకొచ్చిన ఆలోచన నుండే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో.. దానిని సాధించడానికి దీర్ఘమైన, తీవ్రమైన పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాల ఫలితమే ఐక్య కేరళ ఏర్పడింది. మలయాళీల కల సాకారమైంది. ఐక్య కేరళ ఆవిర్భవించి నేటికి 69 సంవత్సరాలు. కానీ ఈ సంవత్సరం కేరళ అవతరణ దినోత్సవం కేరళ ప్రజలకు, ఒక నవ యుగానికి ప్రారంభంలాంటిది. కేరళను భారతదేశంలోనే మొట్టమొదటి తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మార్చడంలో మనం విజయం సాధించాము. ఈరోజు జరుపుకునే అవతరణోత్సవం ఓ చారిత్రాత్మకం. చరిత్రలో ఒక స్థానాన్ని ఏర్పర్చుకుందని అన్నారు. శాసనసభ అనేక చారిత్రాత్మక చట్టాలు, విధాన ప్రకటనలకు సాక్ష్యంగా నిలిచింది. నవ కేరళ సృష్టిలో మరో మైలురాయిని గుర్తించే సమయంలో అసెంబ్లీ ఇప్పుడు సమావేశ మైంది. 2021లో కొత్త మంత్రిత్వశాఖ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో తీవ్ర పేదరికన నిర్మూలన ఒకటి. శాసనసభ ఎన్నికల సమయంలో.. ప్రజలకు ఇచ్చిన అతి ముఖ్యమైన వాగ్దానాలలో ఒకదాన్ని నెరవేర్చడానికి ఇది నాంది కూడా. స్థానిక స్వపరిపాలన శాఖ నాయకత్వంలో, కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో కేవలం రెండు నెలల్లో తీవ్ర పేదరికంలో నివశిస్తున్న కుటుంబాలను గుర్తించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రయత్నంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కుటుంబశ్రీ కార్మికులు, స్వచ్ఛంద సేవకులు, అధికారులు సహా ఇతరులు కూడా భాగస్వాములయ్యారు. ఈ ప్రక్రియలో ప్రజాభాగస్వామ్యం కనిపించింది. మొదటగా వడక్కంచెరి మునిసిపాలిటి, అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచయతీలలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ఆ తరువాత రాష్ట్రం మొత్తానికి విస్తరించాం. సమాజంలో అన్ని వర్గాల నుండి తీసుకున్న సమిష్టి అభిప్రాయాలు, సూచనల ద్వారా లబ్దిదారుల కుటుంబాలను గుర్తించి చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభించాం అని విజయన్ అసెంబ్లీలో అన్నారు. అయితే తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను సిఎం ప్రకటించడంపై ప్రతిపక్షాలు విమర్శించాయి. ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు ఇది మోసం అని మండిపడ్డారు. ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలపై సిఎం విజయన్ స్పందించారు. ప్రతిపక్షనేత వ్యాఖ్యలు అప్రస్తుతమని విజయన్ తోసిపుచ్చారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో అర్థంకావడం లేదని అన్నారు. ఇది ఒక చారిత్రాత్మకమైన ప్రకటన. ప్రపంచానికి తెలియజేయడానికి అసెంబ్లీలో ప్రకటించాం. ప్రతిపక్షనేత వి.డి సతీశన్ దానిని మోసం అనే అంటారు. ఎందుకంటే అది అతనికి అలవాటు అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం తాను నెరవేర్చగల వాగ్దానాలను మాత్రమే చేస్తుంది. చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తుంది. ఇప్పుడు ఇప్పటికే సాధించిన వాటిని నిలబెట్టుకోవడానికి చర్యలు తీసుకుంటాము అని విజయన్ పేర్కొన్నారు. ష్ట్ర అవతరణ దినోత్సవం నాడు.. చారిత్రాత్మక ప్రకటన చేసిన రోజున.. నేడు ప్రతిపక్షాలు అసెంబ్లీని బహిష్కరించడాన్ని పార్లమెంటు వ్యవహారాల మంత్రి ఎం.బి రాజేష్ విమర్శించారు. ఇది చరిత్రలో నిలిచిపోతుంది. చరిత్ర ప్రతిపక్షాన్ని దోషులుగా ప్రకటిస్తుంది అని అన్నారు.

# కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించా లని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించా ల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ



దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

# కాశీబుగ్గ మృతుల కుటుంబాకు లోకేశ్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

చొప్పున సాయం అందిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. క్షతగాత్రులకు రూ.3లక్షల చొప్పున సాయం చేస్తామని ప్రకటించారు. కాశీబుగ్గలోని ఘటనా స్థలితో పాటు, పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంతో ఉదారతతో 94 ఏళ్ల వృద్ధుడు సొంత ఖర్చుతో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. ఇంత మంది భక్తులు వస్తారని ఎవరూ



ఊహించలేదు. బారికేడ్లు ఏర్పాటు చేసినా రద్దీ కారణంగా సరిపోలేదన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి, ఎమ్మెల్యే, అధికారులను అప్రమత్తం చేశాం. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం అని అన్నారు. తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

ప్రజలకు దేవుడిని దగ్గర చేయాలనే సదుద్దేశంతో ఈ ఆలయం నిర్మించారు. తొక్కిసలాట ఘటనపై ఆలయ నిర్వాహకులు, సిబ్బందిని ప్రశ్నిస్తాం అని అన్నారు. పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 మందికి ప్రాణాపాయం లేదు. తీవ్రగాయాలైన వారికి మెరుగైన చికిత్స అందిస్తాం అని లోకేశ్ తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# కృత్రిమ మేథ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేథ వంటి సాంకేతికత మనుషులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోదని అభిప్రాయపడ్డారు. ఎంఐటీ తాజా అధ్యయనం ప్రకారం, జనరేటివ్ ఏఐను తమ వ్యాపారాల్లో ప్రవేశపెట్టిన సంస్థల్లో 95 శాతం విఫలమయ్యాయని.. 5 శాతం సంస్థలు మాత్రమే ఆదాయం పెంచుకున్నాయని తెలిపారు. కృత్రిమ మేధస్సు అనేది మానవ మేధస్సుకు ఒక సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు. పూర్తిగా ఏఐ మీద ఆధారపడితే మానవ ఆలోచనా శక్తిని కోల్పోతామ్నారు. కృత్రిమ మేధస్సును భావోద్వేగాలతో సమతుల్యం చేయకుంటే మానవ జీవితం, గౌరవం కూడా వస్తువులా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఇక రాజధాని అమరావతి గురించి మాట్లాడుతూ..కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి ప్రాంతమంతా తనకు పరిచయ మేనని.. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో కృష్ణా నదిలో ఉన్న దీవుల్లో రహస్య సమావేశాలు నిర్వహించిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ గడ్డ తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఎన్నో పాఠాలు నేర్పిందని... ఇక్కడి ప్రజల నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతానని తెలిపారు. రాజధానిని నిలబెట్టుకోవటం కోసం ఈ ప్రాంత రైతులు చేసిన పోరాటాన్ని జస్టిస్ రమణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారసత్వంగా వచ్చిన భూమిని రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు... అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రో÷–డడెక్కారని, పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అమరావతి వీధుల్లో జరిగిన ఉద్యమం స్వాతంత్ర్యం తర్వాత దక్షిణ భారతదేశంలో జరిగిన అతి పెద్ద, సుదీర్ఘ పోరాటమని అభివర్ణించారు. ప్రభుత్వ యంత్రాంగాల నుంచి ఒత్తిళ్లు వచ్చినా ఓర్పు, సహనం, నిబద్ధతతో వెనుకడుగు వేయని అమరావతి రైతుల ధైర్యానికి వందనం చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంచిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలన అనేది నిరంతర ప్రక్రియ అని, అధికారం మారినప్పుడు విధానాల్ని మార్చటం తప్పని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. అలా చేస్తే వృద్ధి ఆగిపోవటంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అధికార వ్యవస్థను ప్రతీకార రాజకీయాల కోసం ఉపయోగించ కూడదని వ్యాఖ్యానించారు. దేశంలో న్యాయపాలన ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపైనా జస్టిస్ రమణ మాట్లాడారు. విట్ వంటి సంస్థలు కూడా గత ఐదేళ్లు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాయని తెలిపారు. నేటి సమాచార యుగంలో సైతం ఖచ్చితమైన సమాచారం పొందడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. వార్తల వక్రీకరణ, పార్టీలకు అనుగుణంగా పనిచేసే మీడియా ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. స్వేచ్ఛ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రతి అంశాన్ని ట్రోల్ చేయటం, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయటం, మానసిక వేదనకు గురిచేయటం సరికాదన్నారు. సమాచార సృష్టి పేరుతో అత్యల్ప స్థాయికి దిగజారిపోయామని ఆవేదన వెలిబుచ్చారు. సోషల్ మీడియాకు బానిసలైన వారు డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు రాలేకపోతున్నారన్నారు. కంటెంట్ నిజస్వరూపం ఇప్పుడు సమస్యగా మారిందని... ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయటం, డీప్ ఫేక్ వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో బాధితులకు సాయం చేసే సమర్థమైన న్యాయ యంత్రాంగం లేదని, ఆన్‌లైన్‌ను నియంత్రించటం కష్టమైందన్నారు.

# అహనా పెళ్ళంట సీన్ బిఆర్ఎస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని ఆరోపించించారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రుణం తీర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కేటీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మెజార్టీ అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసి ఓట్లు అడుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబంలో వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సాయం చేసిందని.. ఆ రుణాన్ని బీజేపీ ఇప్పుడు తీర్చుకుం టుందని ఆరోపించారు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికలో బీజేపీ డమ్మీ క్యాండిడేట్ ను పెట్టిందని విమర్శించారు. యూసుఫ్ గూడలో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఫేక్ హామీలతో మోసం చేసిందని అన్నారు. ఎంతమందికి రేషన్ కార్డులు ఇచ్చారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 4 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. ఐదేండ్లు మీ మంత్రి వర్గంలో మహిళా మంత్రి ఎందుకు లేరో చెప్పాలని ప్రశ్నించారు. రెండు పార్టీల మధ్య ఉన్న లోపాయి కారి ఒప్పందం తోనే బీజేపీ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని ఆరోపించారు.

# రేవంత్ రెడ్డి బెదిరింపు రాజకీయాలకు భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

అయితే.. గోపినాథ్ అకాల మరణంతో ఈ ఎన్నిక వచ్చిందన్న ఆయన.. తన భర్తను తలుచుకొని సునీత కన్నీరు పెట్టుకుంటే కూడా కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ఫైరయ్యారు. సిగ్గులేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కన్నీళ్లను కూడా రాజకీయం చేస్తోందని ఆయన మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూడా విఫలమైందని కేటీఆర్ ఫైరయ్యారు. మహిళలకు, వృద్ధులకు నెలకు రూ.4వేలు పెన్షన్.. యువతులకు స్కూటీలు, యువతకు రూ.2,500 ఇస్తామని చెప్పి మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ.. పురుషులపై రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పైగా కేసీఆర్ ఇచ్చిన కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు లేవు, రంజాన్, క్రిస్మస్ కానుకలను కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసిందని మండి పడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం.. నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు ఇస్తామని వాగ్దానం చేసి.. నెరవేర్చలేకపోయిందని ఫైర్ అయ్యారు. అటు.. రేవంత్ రెడ్డిది కాంగ్రెస్‌తో ఫేక్ బంధం.. బీజేపీతో పేగు బంధం ఉందని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. తప్పుల మీద తప్పులు చేస్తున్న రేవంత్ సర్కార్‌కు.. జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారని స్పష్టం చేశారు కేటీఆర్. బీఆర్ఎస్‌కు భారీ విజయం దక్కబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతే, 500 రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా తిరిగి వస్తారని చెప్పారు.

# క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ కాంగ్రెగేషన్"ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గ నిర్దేశం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ్, ఈస్పోర్ట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్‌తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుం దన్నారు. భారతదేశ మొత్తం వీఎఫ్ఎక్స్ అవుట్‌పుట్‌లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటీటీ కంటెంట్ ప్రొడక్షన్ లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శన మన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు.

అంతర్జాతీయప్రమాణాలతోకూడిన ఇమేజ్ టవర్‌ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబులిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రిం చేదిగా కాకుండా "కో క్రియేటర్"గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీఏ ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ , ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు.

ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మోద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరదల నష్టాన్ని అంచనా వేసి పంపండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టంతో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఏవిధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీమీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సి.ఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఆయా జిల్లాలలో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎక్కడైనా అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు ధ్వంసం అయితే వాటి పునరుద్ధరణకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎస్ తెలిపారు. అదే విధంగా తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. నష్టపరిహారం అందించేందుకు వీలుగా నష్టం వివరాలను సోమవారం వరకు పంపించాల్సిందిగా కోరారు. ఎలాంటి అలసత్యం లేకుండా పునరావాస చర్యలు తీసుకోవాలని కోరారు.

# 3 నుంచి నిరవధికంగా కాలేజీల బంద్

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రస్తుతం రూ.1200 కోట్ల ఇవ్వాలని అడిగాం. మిగిలిన బకాయిల చెల్లింపులపై రోడ్ మ్యాప్ రూపొందించాలని కోరాం. కేవలం రూ.300 కోట్లు ఇచ్చారు.. ఇంకా రూ.900 కోట్లు దీపావళికి ఇవ్వాలని అడిగాం. నవంబరు ఒకటి నాటికి పెండింగ్ బకాయిలు మొత్తం ఇవ్వాలని కోరాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు అందరినీ కలిశాం. అధికారులు మా విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారు. మమ్మల్ని ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది.

మా మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వృత్తి విద్యా కాలేజీలు నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. రేపటిలోగా మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. బంద్ సమయంలో పరీక్షలు వాయిదా వేయాలి. నవంబర్ 6న అన్ని కాలేజీల స్టాఫ్, సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తాం. నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తాం. ఒకటి.. రెండు కాలేజీలకు ఎందుకు బకాయిలు చెల్లించారు. 10శాతం లంచం తీసుకొని ఇచ్చారా. ఆ కాలేజీలపై విచారణ జరపాలి. అత్యంత ఫ్రాడ్ జరిగే దగ్గర విచారణ జరపాలి. ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్ల ముట్టడి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం' అని రమేష్‌బాబు తెలిపారు.

# కారు షెడ్డుకు పోయింది

(మొదటి పేజీ తరువాయి)

సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్.. సునీతమ్మను మంచిగా చూసుకుంటాడా? ఇవన్నీ వాళ్ల చెల్లెలే బయటకు వచ్చి చెబుతుంది. ఏ ఆడబిడ్డయినా పుట్టింటిపై ఆరోపణలు చేయదు. ఎంత కష్టపెడితే ఆ ఆడబిడ్డ వీళ్ల బాగోతం బయటకు వచ్చి చెబుతుంది?

సొంత చెల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మ కూతురికి బంగారు గాజులు పెడతారంటే నమ్ముతారా? మీ బిడ్డ నవీన్ యాదవ్ ను గెలిపించండి.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెట్టాలని అడుగుతున్నారు. విజయ యాత్రకు మళ్లీ వస్తా. ఈ చౌరస్తాకు పీజేఆర్ చౌరస్తాగా పేరు పెట్టుకుందాం. మీ ప్రాంతంలో పుట్టిపెరిగిన నవీన్ ను గెలిపించండి. ఈ ప్రాంతాన్ని నేను అభివృద్ధి చేస్తా.

మీ అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత నవీన్ తీసుకుంటాడు. మీ మధ్యలో ఉండి మీ సమస్యలు పరిష్కరిస్తాడు. మీకు అండగా ఉండి మీకు సేవ చేస్తాడు. మీరు ఆశీర్వదిస్తే వందల కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటా. నవీన్ ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించండి.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

## హరీష్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం విధితమే. శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాదులోని హరీష్ రావు నివాసం వెళ్లి పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట సురేందర్ రెడ్డి, సురభి వెంకటేశ్వర రావు ఉన్నారు.



## కాంగ్రెస్ విజయం తథ్యం

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ఎవరూ. ఆపలేరని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. రహమత్ నగర్ డివిజన్ లో ఆయన శనివారం ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీ నాయకులు చెప్పే మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. రహమత్ నగర్ డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీ వచ్చేలా నాయకులు శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ అధ్యక్షులు ప్రీతం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, నాయకులు మహేందర్ గౌడ్, ఈర్లపల్లి జగన్ తదితరులు ఉన్నారు.

## పరామర్శ, ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మాదాపూర్ గ్రామానికి చెందిన బొజ్జ ఎల్లమ్మ శుక్రవారం సాయంత్రం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి శనివారం ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎల్లమ్మ మృతదేహానికి





పూలమాలేసి నివాళులర్పించారు. తదుపరి ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు జర్పుల రాధా కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు జెనిగల మహేష్ యాదవ్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఎక్కువయి పల్లి బి ఆర్ ఎస్ . నాయకులు 5000 అందించారు అలాగే కడ్తాల్ మండల కేంద్రానికి బీఆర్ఎస్ నాయకులు పోతుగళ్ళ మహేష్ శుక్రవారం హార్ట్ ఎటాక్ తో మరణించారు. మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ వీరయ్య, సేవ్య నాయక్, వెంకటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ ముత్యాలు, నాయకులు బిక్షపతి, పాండు, మహేష్, కిష్టయ్య, రాకేష్, రాజేష్, నవీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు కానిస్టేబుల్ యాదయ్యకు అవార్డు

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న యాదయ్యకు అవార్డు దక్కిందని ఎస్ఐ వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ కేసులో సెషన్ కోర్టులో నిందితులకు శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించినందుకు ఆయనను అధికారులు అవార్డుకు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డుకు ఎంపికైన ఆయనను శనివారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఉన్నతాధికారులు అభినందించారు.



## పందులను నియంత్రించాలి

### - మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణంలో పందులను నియంత్రించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పందుల పెంపకం దారులు మున్సిపల్ నోటీసులకు స్పందించకుంటే చర్యలు తప్పవని కమిషనర్ శంకర్ హెచ్చరించారు. యజమానులతో సమావేశం నిర్వహించేందుకు నోటీసులు జారీ చేసినా ఒక్కరూ స్పందించలేదని చెప్పారు. మార్కెట్లో ఆరబోసిన ధాన్యాన్ని తినడంపై తీవ్రంగా స్పందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ స్పందన రాకుంటే చర్యలు తీసుకుంటామని కమిషన్ తేల్చి చెప్పారు.










## అక్రమ నిర్మాణాల కూల్చివేత

- ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు...
- దుండిగల్ మండల తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్,నవంబర్ 01 (అక్షర గళం):** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, దుండిగల్- గండిమైసమ్మ మండల పరిధిలోన దొమ్మర పోచంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమి అయిన సర్వే నంబర్ 120 లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు



నేలమట్టం చేశారు. సర్వే నంబర్ 120 లో ప్రభుత్వ భూమిని ఆక్రమణలపై కలెక్టర్ ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

దీంతో కలెక్టర్ సిరియస్ అయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఐదు ఎకరాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను పోలీసుల భారీ బందోబస్తు మధ్య పూర్తిగా నేల మట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ భూములలో కొనుగోలు చేయవద్దని ,దళారులను నమ్మి మోస పోవద్దని సూచించారు. కూల్చివేతల సమయంలో స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆక్రమణలు కూల్చిన సదరు ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాల యాల ఏర్పాట్లకు భూమిని కేటాయించనున్నట్లు సమాచారం..




## బీఆర్ఎస్‌ను నమ్మి మోసపోవద్దు

- కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యం
- కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించండి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** ప్రజలు బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక పాలనను తట్టుకోలేక కాంగ్రెస్ అధికారాన్ని అందించారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, మౌలిక వసతుల కోసం కొద్ది నెలల్లోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం యూసుఫ్ గూడా డివిజన్ లోని పలు బస్తీల్లో కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, ఇక్కడ చేసిన అభివృద్ధిని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు. బీఆర్ఎస్ 11 ఏళ్ల పాలనలో జూబ్లీహిల్స్ ను అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిపిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను పెద్ద ఎత్తున ఓట్లు వేసి అఖండ విజయాన్ని



అందించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మవద్దని, నమ్మి ఇప్పటికే మోసపోయారని, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్,



విష్ణు వర్ధన్ చారి, ఖాదర్ ఖాద్రి, శ్రీరాములు, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, వెంకట్ రెడ్డి, అంజన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, శ్రీను నాయక్, గాజుల రమేష్, కాలే మల్లయ్య, విజయ్ నాయక్, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, రాజ్య నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.



## దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఆమనగల్లు, నవంబర్ 01 (అక్షర గళం):** న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 1న ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీకి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ మేరకు శనివారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ర్యాలీని ప్రారంభించి శ్రీశైలం మాట్లాడుతూ.. భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్‌గవాయిపై దాడికి పాల్పడిన మతోన్మాద న్యాయవాదిని అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. స్వతంత్ర భారతదేశంలో సీజేఐ పైన జరిగిన దాడిని దేశంలోని దళితుల మీద దాడిగానే భావిస్తున్నామని, దళితులు అత్యున్నత స్థానంలో ఉంటే ఓర్వలేని శక్తులు దేశంలో ఎక్కువవుతున్నాయని వాటిని ఖండించడానికి, ఇకపైన ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, శ్రీరాములు, రాకేష్, భీముడు, శాంసన్, వంశీ, రాహుల్ తదితరులు ఉన్నారు.

## నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి ఘన సన్మానం...

**కుత్బుల్లాపూర్, నవంబర్ 01, (అక్షర గళం):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎం.డీ. షబ్బీర్ అలీ బాధ్యతలు చేపట్టి సంవత్సరం కాలం విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం ఏఐటీయూసీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఆశి. యాదయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా షబ్బీర్ అలీ బాధ్యతలు తీసుకున్న తరువాత నిజాం పేట్ మున్సిపల్ కార్మికుల అనేక సమస్యలు పరిష్కారం చేయడం. కార్మికులకు కిట్ ఇవ్వడం జరిగిందన్నారు. అనేక పార్కులు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజిలు వేయడం జరుగుతుందన్నారు.



గోపి కమిషనర్ తరువాత అనేక మంది వచ్చిన చేయని పని ఇప్పుడు షబ్బీర్ అలీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాలభిందెల శ్రీనివాస్, పొన్నికంటి దస్తగిరి, సురేందర్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారుడిపై పిడి యాక్ట్ అమలు చెయ్యాలి

### పరికి చెరువు పరిరక్షణ కమిటీ

**కుత్బుల్లాపూర్, నవంబర్ 01, (అక్షర గళం):** అక్రమంగా కబ్జా చేస్తూ స్థలాన్ని అమ్ముతున్న కబ్జాదారుడి పై పిడి యాక్ట్ అమలు చెయ్యాలని పరికి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమా మహేష్ అన్నారు. జగద్గిరిగుట్టలో పరికి చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్ట, ఎల్లమ్మ బండ, కూకట్ పల్లి లోని ఆల్విన్ కాలనీ లో విస్తరించి ఉన్న పరికి చెరువు ను రక్షించాలని కోరుతూ గత కొద్దీ సంవత్సరాల నుండి చెరువు పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమిస్తుంటే హైడ్రా లో వినతిపత్రం సమర్పించటం వల్ల గత ఫిబ్రవరి నెలలో హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణా లను గుర్తించి కూల్చడం జరిగిందన్నారు. నేడు మళ్ళీ కూల్చిన చోట నిర్మాణాలు జరగడమే కాకుండా మరింత విస్తరించాయని అన్నారు. ఇలాగే కొనసాగితే పరికి చెరువు ఆనవాళ్ళు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. హైడ్రా మరోసారి దృష్టి పెట్టి అక్రమంగా ఏర్పడ్డ నిర్మాణాలను కూల్చి వేసి ఉన్న పరికి చెరువునైన కాపాడాలన్నారు.

హైడ్రా ఇతర చెరువులను అభివృద్ధి చేసినట్టు పరికి చెరువును



అభివృద్ధి చెయ్యాలన్నారు. సరిహద్దులను నిర్ణయించి హద్దులను ఏర్పాటు చెయ్యాలన్నారు. ఈ విషయం పై స్పందన రాకపోతే మరోసారి హైడ్రా కు వినతిపత్రం ఇవ్వడమే కాకుండా ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టుతామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో పరికి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమా మహేష్,సభ్యులు సాయి పంతులు, పవన్, ప్రవీణ్,బాబు, సహదేవ్ రెడ్డిలు పాల్గొన్నారు.

# మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

### ఆలుమ్ని అసోసియేషన్ నూతన గౌరవ అధ్యక్షులుగా డా.ఎన్.యోబు

**కూకట్‌పల్లి, నవంబర్ 01, (అక్షర గళం):** నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఆలుమ్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా కూకట్‌పల్లి రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్ సీఈఓ డా. ఎన్. యోబు ఎన్నికయ్యారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పదాధికారుల బృందాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా కె. శరత్, ప్రధాన కార్యదర్శిగా వై. అనూదీప్, సంయుక్త కార్యదర్శిగా కె. ఉద్ధిత్ సాత్విక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీ రాగ విద్యా, కోశాధికారిగా బి. రణశేషు, కార్యనిర్వాహక సభ్యులు గా తబస్సుమ్, సోఫియా, రఘువరన్, నవిత, వేదవ్యాసవర్ధన్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంహెచ్ఎం పూర్వ విద్యార్థుల మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరచడం, విద్యా, వృత్తి పరమైన పరస్పర సహకారాన్ని పెంపొందించడం, ఆసుపత్రి నిర్వహణలో నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అసోసియేషన్ లక్ష్యమన్నారు. మా సంఘానికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తున్న నిమ్స్ లైసనింగ్ ఆఫీసర్‌డా. రమేష్ మార్తా కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంఘం



ద్వారా, తెలంగాణ , భారతదేశంలోని ఆసుపత్రి నిర్వహణ రంగానికి విలువైన సేవలను అందించే దిశగా కృషి చేస్తామన్నారు.



దివ్యాంగుల సమస్యల పట్ల అనేక ఉద్యమాలు చేపట్టి వారి అభ్యున్నతి కోసం పోరాటం చేసిన నాయకుడు బిక్షపతి వారితో పాటు బాబూరావు, కైలాష్, ప్రవీణ్ లతో పాటు తదితరులు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ , శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, రాష్ట్ర బెవరేజి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ గులాబీ కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

# కెనరా బ్యాంక్ బాలానగర్ బ్రాంచ్ సహకారంతో బీఎల్ బీసీ సమావేశం

**కూకట్‌పల్లి, నవంబర్ 01, (అక్షర గళం):** మూసాపేట, కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ , బాచుపల్లి మునిసిపాలిటీ, నిజాంపేట, బాలానగర్, దుండిగల్, గండిమైసమ్మ మునిసిపాలిటీలకు కెనరా బ్యాంక్ బాలానగర్ బ్రాంచ్ సహకారంతో జేఎంఎల్ బీసీ/ బీఎల్ బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంక్ బాలానగర్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ చీఫ్ మేనేజర్ ఈరన్న జి కోనాలి, మూసాపేట జీహెచ్ఎంసీ పీఓ ఉమా , కూకట్‌పల్లి పీఓ భోగేశ్వర్, పశుసంవర్ధక శాఖ తరపున లొకేషన్ వెటర్నరీ డాక్టర్లు, ఆ ప్రాంతంలోని కమ్యూనిటీ ఆర్గనైజర్లు బ్యాంక్ బ్రాంచ్‌లు , సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎసీపీ లక్ష్య సాధన , ఇతర అన్ని అజెండా అంశాలను సమీక్షించారు. నామినేషన్, రెకైక్ డీఈఎఎఫ్ నిధులతో పాటు ఎఫ్ ఐ సంతృప్త శిబిరాల ప్రాముఖ్యతను కూడా నొక్కిచెప్పడం జరిగింది. ప్రాధాన్యతా రంగంలో రామ్, ఎంఎస్ఎంఈ, హెచ్ ఎల్, ఈ ఎల్, ఎస్హెచ్జీ, లింకేజీలు, పీఎం స్వనిధి ఇతర పీఎం పథకాలను



# అభయ హస్తం కాదు.. భస్మాసుర హస్తం

### 1000 రోజులు గడుస్తున్నా, ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తెలంగాణ బిజెపి చార్జ్‌షీట్

**హైదరాబాద్,(అక్షర గళం):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు పూర్తవుతున్న సందర్భంలో, ఆ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు, 6 గ్యారెంటీలు, మరియు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో తీవ్ర వైఫల్యం చెందింది.



ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బహిర్గతం చేస్తూ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు "కాంగ్రెస్ వైఫల్యాలపై చార్జ్‌షీట్" విడుదల చేశారు.

కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల ముందు విడుదల చేసిన 60 పేజీల మేనిఫెస్టోలో 420 హామీలు, 13 ముఖ్య వాగ్దానాలు, అలాగే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పింది. కానీ ఈ రోజు



100 రోజులు కాదు, దాదాపు 1000 రోజులు గడుస్తున్నా, ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయింది. తెలంగాణ పేదల మీద కాంగ్రెస్ పెట్టిన ఈ హస్తం నిజానికి అభయ హస్తం కాదు. భస్మాసుర హస్తం. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, ఈ చార్జ్‌షీట్ రూపంలో రాష్ట్ర బిజెపి ప్రజల ముందుకు తీసుకువస్తోంది.

ఈ సమావేశంలో బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి , చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , మెదక్ ఎంపీ రఘునందన్ రావు , ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు , బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ బసవ నరసయ్య , పార్టీ సీనియర్ నాయకులు ప్రకాశ్ రెడ్డి , సంగప్ప , దిలీప్ ఆచారి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కేంద్రం ఇచ్చిన పైసలే వాడుకోలేని చేతగాని దద్దమ్మలు మీరు

- మళ్లీ కేంద్రంపై నెపం పేరుతో డ్రామాలాడతారా?
- విపత్తు నిధులు రాష్ట్రంవద్ద రూ.1911 కోట్లు ఉన్న సంగతి మర్చిపోయారా?
- వాటిని ఎందుకు ఖర్చు చేయడం లేదు?
- గతేడాది పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ వైఫల్యం
- ప్రతిదానికి కేంద్రాన్ని బదానం చేసే కుట్రలు చేస్తున్నారు
- అన్నీ కేంద్రమే ఇస్తే ఇక కాంగ్రెస్ పాలన ఎందుకు?
- తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిందే
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ బీజేపీ ఎంపీ గోడం నగేశ్

**హైదరాబాద్,(అక్షర గళం):** భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో, కాంగ్రెస్ 23 నెలల పాలనలో వర్షాలు, వరదలతో తెలంగాణ రైతాంగం దారుణంగా నష్టపోతున్నా పంట నష్ట పరిహారం ఇవ్వకుండా అరిగోస పెడుతున్నారు.

విపత్తు సమయాల్లో ప్రజలను ఆదుకునేందుకు నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్డీఆర్ఎఫ్ పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసినా వాటిని వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ దే. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.1911 కోట్ల 61 లక్షలు అందుబాటులో ఉన్నాయి. వాటిని వాడుకోవడం కూడా కాంగ్రెస్ నేతలకు చేతకావడం లేదు. పదేపదే కేంద్రం సాయం చేయడం లేదంటూ ఎన్డీఏ ప్రభుత్వాన్ని బదనాం చేయడమే పనిగా పెట్టుకోవడం సిగ్గు చేటు. అన్నీ కేంద్రమే ఇవ్వాలంటే ఇగ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఎందుకు దండుగ?



పాలన చేతగాకుంటే తప్పుకోండి. అంతేగానీ కాంగ్రెస్ చేతగానితనాన్ని బీజేపీపై నెట్టి జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందాలనుకోవడం మూర్ఖత్వం.

పంట కోల్పోయి కొందరు, ఇండ్లు కోల్పోయి మరికొందరు, సర్వం కోల్పోయి ఎంతో మంది అల్లాడుతుంటే వారికి భరోసా కూడా ఇవ్వలేని చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలి.

వర్షాలతో నష్టపోయిన రైతులను, ప్రజలకు అండగా నిలవాలి. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇవ్వాలి. తక్షణ సాయంగా ఎకరాకు రూ.30 వేలు ప్రకటించాలి. గతంలో నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించాల్సిందే. లేనిపక్షంలో జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

# అభివృద్ధి నిరూపిస్తే రాజీనామా చేస్తా..

- తులం బంగారం, పింఛన్లు ఇస్తామన్న రేవంత్ రెడ్డిని ఎక్కడ కట్టివేయాలి?
- రేవంత్ రెడ్డి పాలనపై చర్చకు సిద్ధం
- ప్రజలను రేవంత్ రెడ్డి భయపెడుతున్నారా?
- సంక్షేమ పథకాలు ఆగితే పోరాటం ఎట్లా చేయాలో మాకు తెలుసు
- ఎన్టీఆర్‌కు మాగంటి గోపీనాథ్ వీరాభిమాని
- ఎన్టీఆర్‌తో కలిసి మాగంటి గోపీనాథ్ తిరిగారు. కమ్మ వర్గం ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహం గురించి మాట్లాడారు
- ప్రభుత్వాన్ని సర్కస్ కంపెనీలా నడిపిస్తున్నారు
- రేవంత్ రెడ్డి అలవాట్లు అందరికీ ఉండవు
- కాశీబుగ్గ తొక్కిసలాటలో చనిపోయిన భక్తులకు సంతాపం
- సీఎం రేవంత్‌పై విరుచుకుపడిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,(అక్షర గళం):** రేవంత్ రెడ్డి భాష ఇప్పటికైనా మార్చుకోవాలి. సీఎం రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఒపీనియన్ పోల్ కు సిద్ధం కావాలి. 23 నెలల్లో రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఎక్కడ తిరిగారో చెప్పాలి. బిఆర్ఎస్ హయాంలో 44 వేల కోట్లు హైదరాబాద్ నగరంలో ఖర్చు పెట్టాము. కాంగ్రెస్ కేవలం 4,600 కోట్లు మాత్రమే ఉమ్మడి రాష్ట్రంలో ఖర్చు పెట్టింది. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇళ్ళు అయినా కట్టారా? కేటిఆర్ హైదరాబాద్ తిరగలేదని రేవంత్ రెడ్డి అంటున్నారు. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఉన్నారా? లేక వేరే దేశంలో ఉన్నారా? తులం బంగారం,పింఛన్లు ఇస్తామన్న రేవంత్ రెడ్డిని ఎక్కడ కట్టివేయాలి? కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత, 4 వేల కోట్ల అభివృద్ధి జరిగింది అని నిరూపిస్తే రాజీనామాకు నేను సిద్ధంగా ఉన్నా. బిఆర్ఎస్ డిమాండ్ తోనే అజహరుద్దీన్ మంత్రి పదవి వచ్చింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే అజహరుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు?

23 నెలల్లో రేవంత్ రెడ్డి పాలనపై చర్చకు సిద్ధంగా ఉన్నాము. అమీర్ పేట్ కు రేవంత్ రెడ్డి వచ్చి 4 నెలలు అయింది ఏం చేశారో




చెప్పండి. ఎన్టీఆర్‌కు మాగంటి గోపీనాథ్ వీరాభిమాని. ఎన్టీఆర్‌తో కలిసి మాగంటి గోపీనాథ్ తిరిగారు. కమ్మ సామాజిక వర్గం ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహం గురించి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఒక్కటే హైదరాబాద్ నగరంలో ఉందా.? మిగతా నియోజకవర్గాలు లేవా సన్నబియ్యం,రేషన్ కార్డులు తప్ప సీఎం రేవంత్ రెడ్డి ఏం మాట్లాడటంలేదు. బిఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని అంటే నేను రాజీనామాకు సిద్ధంగా ఉన్నా. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన భాష మార్చుకోవాలి. అన్నపూర్ణ అంటే కేసీఆర్కుటుంబం పేరు కాదు కాదా? అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చారు. దేశానికి రెండవ రాజధాని నగరం స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి చెందింది.

ప్రభుత్వాన్ని సర్కస్ కంపెనీలా నడిపిస్తున్నారు. భయంతోనే అజహారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రేవంత్ రెడ్డి రాజ్యాంగ బద్ధమైన సీఎం స్థానంలో ఉన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో 4వేల కోట్ల అభివృద్ధి ఎక్కడ జరిగిందో సీఎం చూపించాలి. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకపోతే పథకాలు ఆగుతాయని అన్నారు.

ప్రజలను రేవంత్ రెడ్డి భయపెడుతున్నారా? సంక్షేమ పథకాలు ఆగితే పోరాటం ఎట్లా చేయాలో మాకు తెలుసు. అసెంబ్లీని ఏ విధంగా స్తంభింపచేయాలో మాకు తెలుసు. అసెంబ్లీలో మాట్లాడకుండా పనిచేసే ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారు. మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి చేశారు. మాగంటి గోపీనాథ్ చివరి వరకు ప్రజల్లో ఉన్నారు. రేవంత్ రెడ్డి అలవాట్లు అందరికీ ఉండవు. ప్రజలను భయపెడితే చూస్తూ ఊరుకోరు

ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే పద్మారావు ,ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి కార్పొరేటర్లు సామల హేమ, ప్రసన్న లక్ష్మి, బీఆర్ఎస్ నేత మహేందర్ పాల్గొన్నారు.




# రేవంత్ రెడ్డి రాజులా ఫీలవుతున్నారు

### కాంగ్రెస్ తోక కత్తరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
### ఓటమి భయంతో రేవంత్ రెడ్డి ప్రజలనే బెదిరిస్తున్నారు
### రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు
### రేవంత్ ప్రజల సొమ్ముకు ధర్మ కర్త
### ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు బుద్ధి చెబుతారు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,(అక్షర గళం):** ఓటమి భయంతో రేవంత్ రెడ్డి ప్రజలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చిన కాంగ్రెస్.. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ప్రజల మెడలో గొలుసులు కూడా లాక్కుంటోందని సెటైర్లు వేశారు. అటు.. ఫ్రీ బస్ పేరుతో భార్య డబ్బులను కూడా భర్త నుంచి వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎన్నో పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు . కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ ఇచ్చారని చెప్పారు. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12 వేలు అందించామని వెల్లడించారు. ఇలాంటి ఎన్నో పథకాలను రేవంత్ సర్కార్ బంద్ చేసిందని అన్నారు కేటీఆర్. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రంజాన్ తోఫా బంద్, బతుకమ్మ చీరలు బంద్, క్రిస్మస్ గిఫ్ట్.. ఇలా అన్నీ పథకాలను బంద్ చేసిందని మండిపడ్డారు. ప్రజలనే బెదిరించే స్థాయికి రేవంత్ రెడ్డి చేరుకున్నారని ఫైరయ్యారు. ఎన్నికలు వస్తే ఎవరైనా ఏం చేస్తారో చెప్తారు.. కానీ రేవంత్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకపోగా.. అన్ని బంద్ చేస్తామంటూ ప్రజలకు వార్నింగ్ ఇస్తున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు.. అది మర్చిపోయి రాజులా ఫీలవుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రజల సొమ్ముకు ధర్మ కర్త అంతే అని.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

అసలు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు కేటీఆర్. రియల్ ఎస్టేట్ నాశనం చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. హైడ్రా, బుల్డోజర్ పేరుతో పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఫైరయ్యారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకపోగా, రెండేళ్లలోనే రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ తోక కత్తరించాలని పిలుపునిచ్చారు. భర్త చనిపోయి మాగంటి సునీత ఏడిస్తే.. దాన్ని కూడా డ్రామా అంటున్న కాంగ్రెస్‌కు మహిళలు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను మళ్లీ తెచ్చుకోవాలంటే.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలన్న కేటీఆర్.. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ రెడ్డి 'బిల్లు రంగా'గా మారారు

- రేవంత్ రెడ్డి గద్దర్ కుమార్తెను మోసం చేశారు
- ఉప ఎన్నికల్లో వెన్నెలకు రేవంత్ రెడ్డి ఎందుకు టిక్కెట్ ఇవ్వలేదు?
- దుబ్బాకలో సోలిపేట రామలింగారెడ్డి సతీమణికి కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారు
- 4వేల కోట్లు కంటోన్మెంట్‌కు రేవంత్ రెడ్డి ఎక్కడ ఇచ్చారు?
- రాజుగారి దేవత వస్త్రం కథలా రేవంత్ రెడ్డి
- రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధిని చూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్, గజ్జెల నగేష్





హైదరాబాద్,(అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు ఓట్లు వేస్తారని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ కోడి కథ జూబ్లీహిల్స్ ప్రజలకు తెలిసింది. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రజల చెవిలో క్యాలీఫ్లవర్ పెడుతున్నారు.

కంటోన్మెంట్‌కు రేవంత్ రెడ్డి ఇచ్చిన నాలుగు వేల కోట్లు ఎక్కడ? కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఎలివేటెడ్ కారిడార్ ను కేంద్ర ప్రభుత్వం అప్రూవల్ చేసింది. బోర్డు మీటింగ్ కు మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఎస్.ఆర్.డి.పి లో భాగంగా అభివృద్ధి జరిగింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇచ్చారు?

రేవంత్ రెడ్డి సల్మాన్ ఖాన్‌తో బిజీగా ఉన్నారు. జూబ్లీహిల్స్ లో చర్చకు రెడీగా ఉన్నాం. కంటోన్మెంట్ ఎమ్మెల్యేను రేవంత్ రెడ్డి పంపాలి. కంటోన్మెంట్ లో 6 వేల ఇందిరమ్మ ఇళ్ళు ఎక్కడ ఉన్నాయి? కంటోన్మెంట్ కు కేసీఆర్ వెయ్యి పడకల టిమ్స్ హాస్పిటల్ ఇచ్చారు. ఆసుపత్రి పనులు 85 శాతం పూర్తి అయ్యాయి. రేవంత్ రెడ్డికి రంగులు వేయడం చేతగావడం లేదు. డిజిటల్ హెల్త్ కార్డులపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. 50 లక్షలు ఇచ్చి పదికోట్లు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి అభ్యర్థిని అద్దెకు తెచ్చుకున్నారు. సెంటిమెంట్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడతారా? కేసీఆర్ మాగంటి సునీతకు సాలిడారిటీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి గద్దర్ కుమార్తెను మోసం చేశారు.

ఉప ఎన్నికల్లో వెన్నెలకు రేవంత్ రెడ్డి ఎందుకు టిక్కెట్ ఇవ్వలేదు? రేవంత్ రెడ్డికి,కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు ఎలాంటి లావాదేవీలు జరిగాయో తెలియదు. దుబ్బాకలో సోలిపేట రామలింగారెడ్డి సతీమణికి కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారు.

### జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోరు

**- కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్**

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రక్షణ శాఖ భూములను బదలాయింపు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలు ఇస్తామని మోసం చేశారు. కేంద్ర రక్షణ శాఖామంత్రి వద్దకు

### రేవంత్ రెడ్డి వెళ్లి కంటోన్మెంట్ గురించి మాట్లాడారా?

కంటోన్మెంట్ ప్రజలను మోసం చేసినట్లు జూబ్లీహిల్స్ ప్రజలను మోసం చేయాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. 25 వేలు ఇచ్చే పరిస్థితి లేదు 4వేల కోట్లు కంటోన్మెంట్ కు రేవంత్ రెడ్డి ఎక్కడ ఇచ్చారు? రేవంత్ రెడ్డి కలలో 4వేల కోట్లు ఇచ్చారా? బస్తీ దవాఖానలను పట్టించుకోవడం లేదు. కంటోన్మెంట్ అద్దంలా మారిందని రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్తున్నారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని కలుపుతామని రేవంత్ రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం ఏమైంది? రాజుగారి దేవత వస్త్రం కథలా రేవంత్ రెడ్డి తీరు ఉంది. కంటోన్మెంట్ కు వచ్చి చేసిన అభివృద్ధిని రేవంత్ రెడ్డి చూపిస్తే ముక్కు నేలకు రాస్తాము. బిల్లా రంగాను ప్రజలు ఎప్పుడో మర్చిపోయారు. రేవంత్ రెడ్డి 'బిల్లు రంగా'గా మారారు. బిల్లు వసూలు చేసి ఢిల్లీలో కడుతున్నారు.

### సాయన్న అభివృద్ధి చేశారు: నివేదిత కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇంచార్జ్

నిన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆశ్చర్యంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకపోతే పథకాలు ఇవ్వమని సీఎం డైరెక్ట్ గా చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయం రేవంత్ రెడ్డికి పట్టుకుంది. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే సాయన్న అభివృద్ధి చేశారు. కంటోన్మెంట్ ప్రతి గల్లీలో సాయన్న శిలాఫలకాలు ఉంటాయి. కంటోన్మెంట్ నియోజకవర్గంలో మా కుటుంబంపై కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారం చేసింది. జూబ్లీహిల్స్‌లో మాగంటి సునితపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోంది. మాగంటి సునితపై బురద చల్లుతున్నారు. మహిళలకు గౌరవం ఇవ్వని కాంగ్రెస్ పార్టీని జూబ్లీహిల్స్ ప్రజలు ఓడించాలి. మహిళలకు అవమానిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఓట్లు వేస్తారా?

# రేవంత్ బ్లాక్‌మెయిల్

- బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- ధైర్యం ఉంటే, మీరు ప్రజలకు ఇచ్చిన 420 హామీలను ముందు నెరవేర్చండి
- కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాల, అసమర్థ, మోసాల పాలనపై బిజెపి చార్జ్‌షీట్ విడుదల సందర్భంగా మీడియాతో బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్,(అక్షర గళం): 23 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటీ నెరవేర్చని పూర్తిగా వైఫల్యం చెందిన ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజల వద్ద ఓటు అడిగే హక్కు లేదు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార సభలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ ప్రచారానికి దిగజారారు."కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రూ.2000 పెన్షన్ కట్ అవుతుంది, 25వేల రేషన్ కార్డులు రద్దవుతాయి, ఉచిత బియ్యం రావు" అని ప్రజలను భయపెట్టే విధంగా మాట్లాడారు. ఇది పూర్తిగా బ్లాక్‌మెయిల్ టాక్టిక్. ఇలాంటి బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకం.

ప్రజలను భయపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నందుకు మేము ఈ వ్యవహారాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లబోతున్నాం. రేవంత్ రెడ్డి మీరు ఇచ్చిన హామీలను ఒక్కటైనా నెరవేర్చక, ఇప్పుడు ప్రజల సంక్షేమ పథకాల పేరుతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.

ఒకవైపు ప్రజలను బెదిరిస్తూ, మరోవైపు బిజెపి నాయకులపై తప్పుడు విమర్శలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యం ఉంటే, మీరు ప్రజలకు ఇచ్చిన 420 హామీలను ముందుగా నెరవేర్చండి. తర్వాతే ప్రజల వద్ద ఓటు అడిగే నైతిక హక్కు మీకు ఉంటుంది.

## కేటీఆర్?.. సమస్యలకు కారణం
# నువ్వు-మీ అయ్య కాదా?

- అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డి జాగీర్ ఏమైనా పోతుందా?
- పీజేఆర్ వారసత్వాన్ని నవీన్ యాదవ్ కొనసాగిస్తారు
- ఎర్రగడ్డ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,(అక్షర గళం): సానుభూతితో బీఆరెస్ ఓట్లు దండుకోవాలని ప్రయత్ని స్తోంది. గత సంప్రదాయాలను తుంగలో తొక్కింది కేసీఆర్. సెంటిమెంట్ పేరుతో బీఆరెస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. 2007 లో పీజేఆర్ ఆకస్మికంగా చనిపోతే ఏకగ్రీవంగా చేయాలంటే అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన దుర్మార్గుడు కెసీఆర్. ఆనాడు పీజేఆర్ కుటుంబాన్ని మూడు గంటలు బయట నిలబెట్టి కేసీఆర్ అవమానించాడు.

పీజేఆర్ కుటుంబంపై పోటీ పెట్టి సంప్రదాయాన్ని తుంగలో తొక్కింది కేసీఆర్. కారు షెడ్డుకుపోయిందని బిల్లా రంగాలు ఆటోలలో తిరుగుతున్నారు. జూబ్లీహిల్స్‌లో సమస్యలు పేరుకుపోవడానికి కారణం నువ్వు మీ అయ్య కాదా కేటీఆర్? పదేళ్లు అధికారంలో ఉన్న మీరు సమస్యలు పరిష్కరించి ఉంటే జూబ్లీహిల్స్‌కు ఈ పరిస్థితి వచ్చేదా?

పదేళ్లు అధికారంలో ఉన్న మీరు మైనారిటీ సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు? మా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 70 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఈ బస్తీల్లో రేషన్ కార్డులు ఇచ్చింది మేం కాదా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చి మిమ్మల్ని ఆదుకున్నది కాంగ్రెస్ కాదా? ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ సన్నబియ్యం ఇస్తున్నది మేం కాదా?

ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది నిజం కాదా? ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని, సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్.. సునీతమ్మను మంచిగా చూసుకుంటాడా? సొంత చెల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మ కూతురికి బంగారు గాజులు పెడతారంటే నమ్ముతారా?

కంటోన్మెంట్ ఉపఎన్నికలో శ్రీ గణేష్ ను గెలిపించగానే ఆ నియోజకవర్గాన్ని 4 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం.

జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి జరగాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించండి. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డి జాగీర్ ఏమైనా పోతుందా? ఎందుకు అడ్డుకోవాలని చూశారు? అప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆరెస్ పనిచేసింది. ఇప్పుడు బీజేపీ వాళ్లు బీఆరెస్ ను గెలిపించేందుకు పనిచేస్తున్నారు.

కేంద్రంలో ప్రతీ సందర్భంలో మోదీకి కెసీఆర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మైనారిటీలకు మేలు జరుగుతుంది. మీ బిడ్డ నవీన్ యాదవ్‌ను గెలిపించండి. ఎమ్మెల్యేగా నవీన్, మంత్రిగా అజారుద్దీన్ మీకు అండగా ఉంటారు. పీజేఆర్ తరువాత జూబ్లీహిల్స్ కు నాయకుడు లేకుండాపోయారు. పీజేఆర్ వారసత్వాన్ని నవీన్ యాదవ్ కొనసాగిస్తారు. పేదలకు అండగా ఉంటారు.



# మాపై దుష్ప్రచారంలో బీజేపీ, బీఆర్ఎస్ పోటీ

- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే సీఎం వ్యాఖ్యల వక్రీకరణ
- ఏ ఒక్క సంక్షేమ పథకం ఆగలేదు... ఆగదు కూడా
- ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఈ డైవర్షన్ డ్రామా
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్,(అక్షర గళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మెజార్టీని పెంచుకునేందుకు కాంగ్రెస్ పని చేస్తుంటే... బీజేపీ, బీఆర్ఎస్ మాత్రం మాపై తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పోటీ పడుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లారెడ్డిగూడలోని శాలివాహన నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్, బీజేపీ అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని మండిపడ్డారు.

ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఇప్పుడు కొత్త డైవర్షన్ డ్రామాకు తెరదీశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తమకు అనుకూలంగా వక్రీకరించుకొని మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మా ప్రభుత్వం ప్రజలకు మంచి చేసే ఏ ఒక్క ప్రధాన సంక్షేమ పథకాన్ని రద్దు చేయలేదని, ఆపలేదన్నారు. అలాంటి ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి యుద్ధం చేసి గెలిచిన చక్రవర్తిలా ఫీల్ అవుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేను రాజు కాదు అని ప్రజల సొమ్ముకు ధర్మకర్త మాత్రమే అని ఇప్పటికే ఎన్నోసార్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని, ఈ విషయంలో మా చిత్తశుద్ధిని శంకించే అర్హత బీఆర్ఎస్ కు గానీ బీజేపీకి గానీ లేదన్నారు. ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎవరికీ అన్యాయం జరగదని, జరగనివ్వమన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించే ముందు, పేదలకు పునరావాసం కల్పించాకే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో అధికారుల అత్యుత్సాహాన్ని సహించమన్నారు. ఇప్పటికైనా ప్రజల తీర్పును గౌరవించి, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరారు.

ప్రతిపక్షాల జూటా మాటలు నమ్మి మోసపోవద్దని, తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే అజెండాగా ముందుకెళ్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కు మద్దతు తెలిపిన మాదిగ దండోరా, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా, టి.ఎం.ఆర్.పి.ఎస్, ఉస్మానియా యూనివర్సిటీ టీజీఆర్ఎస్ఏ తదితర 9 దళిత సంఘాల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఏఐసీసీ ఇంచార్జ్ విశ్వనాథ్, ఎమ్మెల్యేలు విజయ రామారావు, మక్కన్ సింగ్ ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ భాను ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

## రేవంత్.. ఏ మొహంతో
# ప్రజల దగ్గరికి వెళ్తున్నారు?

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఒక్కటయినా నెరవేర్చారా?
- కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాల, అసమర్థ, మోసాల పాలనపై బిజెపి చార్జ్‌షీట్ విడుదల సందర్భంగా మీడియాతో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



హైదరాబాద్,(అక్షర గళం):23 నెలల కాంగ్రెస్ పార్టీ పాలన తెలంగాణ ప్రజలకు ఒక భస్మాసుర హస్తంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు? ఏ మొహంతో ఈరోజు ప్రజల దగ్గరికి వెళ్తున్నారు? మోసపూరితమైన మాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి 23 నెలలు పూర్తయ్యాయి. కానీ ఇప్పటికీ ఏ వర్గానికీ మీరు న్యాయం చేయలేదు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా ప్రశ్నిస్తోంది. విద్యార్థులు ఫీ రీయింబర్స్‌మెంట్ కోసం బాధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వారి చదువులు ఆగిపోతున్నాయి. పేషెంట్లకు హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందడంలేదు. కోట్లాది రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటోంది.

రైతులకు "రుణమాఫీ" చేస్తామని చెప్పి, చివరికి ప్రజలే మిమ్మల్ని మాఫీ చేయాలా అని ఆలోచించే పరిస్థితి తీసుకొచ్చారు. తెలంగాణ ప్రజలందరు కూడా ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీని అడగండి . ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఒక్కటయినా నెరవేర్చారా?" అని. నిన్న మొన్న విద్యార్థులు స్కూటీల కోసం నిరసన ప్రదర్శన చేసిన ఘటన కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు ఇస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం, నేడు విద్యార్థులకు సైకిల్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉంది.

మోసపూరిత వాగ్దానాలు, ఎన్నికల ముందు ఇచ్చిన ఆకర్షణీయ హామీలు ం ఇవన్నీ ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకం మాత్రమేనని ఈరోజు స్పష్టమవుతోంది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు.. కేవలం ఓట్ల కోసం వేసిన వల మాత్రమే. బీసీ వర్గాల ఆశలను కూడా మోసం చేసిన ప్రభుత్వం ఇది.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల దారిలోనే నడుస్తోంది. ప్రజల ఆస్తులు, అభివృద్ధి, శాంతి భద్రతలకు మించి, అధికారాన్ని కాపాడుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమైపోయింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ గౌరవం, జవాన్ల త్యాగాలు, జాతీయ భద్రత వంటి అంశాలపై అసభ్య వ్యాఖ్యలు చేయడం బాధాకరం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఇటువంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను, గర్వాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి.

పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా నిలిచేలా, వారిని ఆదుకునేలా నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఈ దుర్ఘటన పట్ల ప్రతి భారతీయుడు బాధపడతాడు. కానీ ఇలాంటి విషాదాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ఎవరికీ హక్కు లేదు.

రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేశాన్ని, సైనికుల త్యాగాన్ని, పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరుల జ్ఞాపకాన్ని అవమానపరిచేలా ఉన్నాయి. ఇది తెలంగాణ ప్రజల గర్వాన్ని దెబ్బతీయడం మాత్రమే కాదు, దేశ గౌరవాన్ని తక్కువ చేయడమే.

భారతీయ జనతా పార్టీ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తుంది. దేశ భద్రత, సైనికుల త్యాగం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే విషయం కాదు. దేశ గౌరవం కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత. దేశ భద్రత, సైనికుల త్యాగం ఇవి రాజకీయ వాదప్రతివాదాలకు విషయం కావు. వీటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రజల బాధను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించవద్దు. కాంగ్రెస్ నేతలు తమ వ్యాఖ్యలపై సమాధానం చెప్పి తప్పు జరిగిందని ప్రజల ముందు క్షమాపణ చెప్పాలి. లేకుంటే సహించేది లేదు. ఈ రోజు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన చార్జ్‌షీట్ ద్వారా తెలంగాణ ప్రజల ముందు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను స్పష్టంగా ఉంచుతున్నాం. ప్రజలకు నిజాలు తెలియజేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తమ పనితీరు గురించి ప్రజల ఎదుట సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

## గుడి భూములు కబ్జా..
# ప్రభుత్వ, డిఫెన్స్ భూములు ఖబర్‌స్తాన్‌లకా?

- గుడి భూముల విషయంలో వీరికి ధైర్యం ఎక్కువ కానీ మసీదు భూములను మాత్రం ఒక్క ఎకరం కూడా తాకే ధైర్యం లేదు
- ఇదే వీరి సెక్యులరిజం
- జూబ్లీహిల్స్ కూడా ఓల్డ్ సిటీలా మారిపోతుంది
- సీతారాంపూర్ సీతారాముల స్వామి గుడికి చెందిన 1100 ఎకరాల ఎండోమెంట్స్ భూమిని దేవాదాయ శాఖకు అప్పగించాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



హైదరాబాద్,(అక్షర గళం):

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, సీతారాంపూర్ సీతారాముల స్వామి గుడికి చెందిన 1100 ఎకరాల ఎండోమెంట్స్ భూమిని ప్రభుత్వం నోటిఫై చేసి, వ్యాపారులకు అమ్మేసింది. ఇది పూర్తిగా అక్రమం. ఎండోమెంట్స్ భూమిని ప్రభుత్వం వేలం వేసి అమ్మడం చట్టవిరుద్ధం. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విధంగా చేసింది.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిని తిరిగి దేవాదాయ శాఖకు అప్పగించాలి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి పునరుద్ధరించాలి. కానీ అది కూడా చేయలేదు. అందువల్ల టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) మరియు కాంగ్రెస్.. రెండూ ఒకటే అని స్పష్టమవుతోంది.

మరోవైపు జూబ్లీహిల్స్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ ప్రభుత్వం ప్రభుత్వ భూములు, డిఫెన్స్ భూములు కూడా తీసుకుని ఖబర్‌స్తాన్‌లకు ఇస్తోంది. గుడి భూములను మాత్రం కబ్జా చేసి అమ్మేస్తున్నారు. గుడి భూముల విషయంలో వీరికి ధైర్యం ఎక్కువ. కానీ మసీదు భూములను మాత్రం ఒక్క ఎకరం కూడా తాకే ధైర్యం లేదు. ఇదే వీరి "సెక్యులరిజం"!

ఇప్పుడు ఈ పని "అభివృద్ధి కోసం" అని చెప్పుకుంటున్నారు. కానీ ఇది అభివృద్ధి కాదు ం దేవాలయ భూములపై దాడి. ఇప్పటికి ఖబర్‌స్తాన్‌కు ఇస్తున్నారు, రేపు మదర్సాలకు ఇస్తారు. ఇలా కొనసాగితే, జూబ్లీహిల్స్ కూడా ఓల్డ్ సిటీలా మారిపోతుంది. సాధారణ ప్రజలు అక్కడ నివసించలేని పరిస్థితి వస్తుంది.

అందుకే మేము ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ కాంగ్రెస్–ఎంఐఎం దుర్మార్గాలను, ఆగడాలను, మోసాలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నాం. నిజమైన ప్రజల నమ్మకాన్ని సాధిస్తున్నాం. దీన్నే మేము "కార్పెట్ బాంబింగ్" అంటున్నాం.

# ఆ ఆరుగురుని విచారించడానికి గడువు కావాలి

- సుప్రీంకోర్టును కోరిన స్పీకర్



హైదరాబాద్,(అక్షర గళం): ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై సుప్రీం కోర్టును మరో 8 వారలు గడువును స్పీకర్ కోరారు. సుప్రీంకోర్టు విధించిన 3 నెలల గడువులో కేవలం నలుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలను మాత్రమే స్పీకర్ విచారించారు. మరో ఆరుగురు ఎమ్మెల్యేలను విచారించడానికి స్పీకర్ గడువు కోరారు. సుప్రీంకోర్టులో స్పీకర్ పిటిషన్ ఇంకా అడ్మిట్ కాలేదు. మరోవైపు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం తుంగలో తొక్కి, 3 నెలల సమయం వృథా చేశారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. దానం నాగేందర్, కడియం శ్రీహరిలను విచారించకుండా కావాలని సాకులు చెప్తున్నారని.. అదనపు గడువు ఇవ్వకుండా, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ కేవియట్ పిటిషన్ వేసింది.

# సంపాదకీయం..

## తుఫాన్ బాధితులను గాలికి వదిలేస్తే ఎలా?

చెరువులు, నాలుల కబ్జాకు గురవుతున్నాయని స్వయంగా ప్రకటిస్తున్న పాలకులు అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాకోరులను ప్రభుత్వాలే రక్షిస్తూ గడుసు మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాలు తలచుకుంటే కబ్జారాయుళ్లను తొలగించడం నిముషంలో పని. హైడ్రా చేస్తున్న పనిని అంతటా చేయించే బాధ్యత ఉందా లేదా అన్నది సిఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి. వరంగల్ జిల్లాలో వరదనష్టం సందర్భంగా కబ్జాలపై వ్యాఖ్యలు చేసిన సిఎం, అందుకు తగ్గట్లుగా ప్రణ్యాళిక సిద్దం చేసి చిత్తశుద్దిని చాటాలి. ఉత్పాతాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా సాయం ప్రకటించడం, అందరినీ ఆదుకున్నామని చెప్పడంతో సరిపెట్టేస్తున్నారు. ఇల్లు మునిగిని వారికి 15 వేలు పరిహారంగా తెలంగాణ సిఎం ప్రకటించారు. ఈ డబ్బుతో ఏం వస్తుందో అధికారులు, సిఎం రేవంత్ రెడ్డి చెబితే బాగుండేది. దెబ్బతిన్న ఇళ్లను, రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించడం లేదు. ఆక్రమణలను తొలగించాలన్న దానికి కూడా ప్రణాళిక లేదు. అలాగే ఎపిలో తుపాన్‌లో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు సర్టిఫికెట్లు ఇచ్చారు. అధికారులు పనిచేయడం వారి విధి. జీతాలు తీసుకుంటున్నారు. అయినా వెన్నుతట్టి ప్రోత్సహిం చాల్సిందే. ఇదే సమయంలో గ్రామాల వారీగా నష్టపోయిన వారి లెక్కలు తీసుకుని ఆదుకుంటే బాగుం టుంది. ఎందుకంటే తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు సామాన్యుల జీవితాలు చిగురుటాకులా వణికిపోతు న్నాయి. వీరిని ఆదుకోవాలి. ఆదుకునే వరకు మనమంతా సంఘటితంగా ముందుకు సాగాలి. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల




ఆదుకోవడమే అత్యంత ముఖ్యం. తుఫాన్ గండం గడిచింది కనుక గ్రామాల వారీగా తెలుగు రాష్ట్రాల్లో బాధితులను గుర్తించి వారిని ఆదుకోవాలి. పంటలను ఎంతమేరకు నష్టపోయారో లెక్కలు వేయాలి. ఎకరా పంటకు ఎంతపెట్టుబడి పెట్టారో గుర్తించాలి. అన్నదాతల విషయంలో అలసత్వం తగదు. తాజా మొంథా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు.

బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేసి ఆదుకోవడంలో కేంద్రం ఉదారంగా ముందుకు రావాలి. పంటనష్టపోయిన రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాలి. గతంలో పెనుతుపానులు, వరదలు వచ్చినప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన

బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ముందుగానే అంచనా వేసినట్లుగానే మొంథా అల్లకల్లోలం సృష్టించింది. ప్రత్యేకించి కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్టు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశర చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. అయితే ఇదే చొరవతో ఇప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవాలి. సామాన్యుల నుంచి రైతుల వరకు అనేకులు తీవ్రంగా నష్టపోయారు. వారిని గుర్తించి ఆదుకోవడం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

## కార్తీక ఏకాదశితో ఆలయాల్లో రద్దీ


కార్తిక మాసం శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మహా విష్ణువు ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణ్యా మారుమోగాయి. యాదగిరిగుట్టతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. దీనిని చిలుకు ఏకాదశి కూడా అంటారు. దీంతో హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని అన్న వైష్ణవాలయాల్లో రద్దీ



నెలకొంది. యాదాద్రితో పాటు రత్నగిరి, నగరంలోని టిటిడి వెంకటేశ్వరాలయాలు, పాతబస్ ఈ రంగనాథ ఆలయంలో రద్దీ కనిపించింది. శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, చిన్నదూగం కూడలిలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు కోటబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస మండల ప్రాంతాల్లోనూ విష్ణు, శివ ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సుమారు కిలోమీటర్ పొడవునా బారులు తీరారు. కార్తిక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.

# ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

సత్యసాయి శతజయంతి ఉత్సవాలని ఘనంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. సత్యసాయి బాబా అనంతపురం జిల్లాకు నీటి సరఫరా విషయంలో తన దగ్గర మాట తీసుకున్నారని గుర్తుచేశారు. ఎల్ అండ్ టీ ద్వారా తాను గతంలో ఆ పనులు చేయించానని... కానీ ఆ తర్వాత వచ్చిన పాలకులు ఆ పనులని ఎందుకు నిలిపేశారని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఈ నెల13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని ప్రకటించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్‌లతో ఓ కమిటీ వేశామని తెలిపారు. సత్యసాయి ట్రస్టుతో కలిసి మంత్రుల కమిటీ శతజయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తుందని చెప్పుకొచ్చారు. ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. అభివృద్ధి అజెండాతో పనిచేస్తున్న బీజేపీ.. గుజరాత్ రాష్ట్రంలో గడచిన 25 ఏళ్లుగా అధికారంలో ఉందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. ఎపీలో ఏ వ్యక్తి తప్పు




చేసినా ప్రభుత్వ నిఘా నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అత్యాచారాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(శనివారం) సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. చిత్తూరు మాజీ మేయర్ దంపతుల హత్య కేసులో నిన్ననే కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ కేసులో ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు సీఎం చంద్రబాబు. న్యాయం జరగడానికి ఆలస్యం అయినా.. తప్పు చేసిన వారు తప్పించు కోలేరనడానికి ఈ తీర్పు అతిపెద్ద ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. అతి దారుణంగా మేయర్ కార్యాలయంలోనే ఆ దంపతుల్ని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో తాము అభివృద్ధి చేసిన వాటిని గత పాలకులు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ వచ్చి వాటినే మొదలు పెట్టాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చేసిన పనులని విధ్వంసం చేస్తే.. మళ్లీ వాటినే పునరుద్ధరించటం చాలా కష్టతరం అవుతుందని వెల్లడించారు. ప్రజలంతా ఆలోచించి తమ ప్రభుత్వానికి సహకరిస్తేనే శాశ్వతంగా మంచి జరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తోక కట్ చేయడం ఖాయం

అహానా పెళ్లంట సినిమా తరహాలో రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని.. కోడిని వేలాడదీసి పచ్చడి మెతుకులు పెడతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు అని.. అది మర్చిపోయిరాజులా ఫీలవుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ తోక కత్తరించేందుకు రెడీగా ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. తెలంగాణ టీడీపీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు.. ఆయన సతీమణి, టీడీపీ నాయకురాలు సుజాతతో పాటు పలువురు నేతలు శనివారం నాడు గులాబీ పార్టీలో చేరారు. పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు కేటీఆర్. వేసిన నామినేషన్ విత్‌డ్రా చేసుకొని మరీ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్న ప్రవీణ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. శ్రీనివాస్ నాయుడు చాలా కాలం నుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని.. ఐదేళ్ల కిందటే రావాల్సిన నాయకుడు ఇప్పుడు వచ్చారని అన్నారు. మన పార్టీ నుంచి గెలిచి మేయర్ అయిన వ్యక్తి ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఏ పనులు చేయట్లేదని.. ఇక మేయర్ మనకు ఏం పనులు చేస్తుందని దుయ్యబట్టారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని గ్యారెంటీ కార్డులు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించారని ఫైర్ అయ్యారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ లక్ష రూపాయలు ఇస్తే.. తులం బంగారం కూడా ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారని అన్నారు. ఇప్పుడు తులం బంగారం ఇవ్వకపోగా.. మెడలో గొలుసు కూడా లాక్కెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ ఇస్తున్నామని చెప్పి భార్యకి ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కేసీఆర్ అమలు చేశారని.. అలాగే కేసీఆర్ కిట్ ఇచ్చారని కొనియాడారు. తమ హయాంలో ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో జరిగాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు.. ఇలా అన్ని పథకాలు బంద్ అయ్యాయని ఆగ్రహించారు. ఎన్నికలు వస్తే ఎవరైనా ఏం చేస్తారో చెప్తారు.. కానీ బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ నాశనం చేశారని.. రెండేళ్లలో ఏం మంచిపని చేశారో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ



పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ఫైర్ అయ్యారు. హైడ్రా, బుల్డోజర్ పేరుతో పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. బీసీ, ఎస్సీ డిక్లరేషన్ అంటూ నోటికొచ్చిన 420 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో చనిపోతే ఈ నెల 11న బైపోల్ ఎన్నిక వచ్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పారు. భర్త చనిపోయి మాగంటి సునీత ఏడిస్తే.. దాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు డ్రామా అంటున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తే కూడా ఇంత అన్యాయంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డను అవమానిస్తున్న వారికి బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. అధికారంలోకి రాగానే మేయర్, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరినా ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ విజయంతోనే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలని.. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో మాగంటి సునీత ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు.

# వైకాపా ఓ పెద్ద ఫేక్ పార్టీ : వారి జీవితమే ఫేక్

వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీకి ఏమీ దొరకటం లేదని.. వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా చేశారు. శనివారం సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డిని గొడ్డలితో చంపి తనపై నెట్టేశారని ఫైర్ అయ్యారు సీఎం చంద్రబాబు. సాక్షిలో గుండెపోటు అని వస్తే తానూ నమ్మేశానని.. తానెప్పుడూ రాగద్వేషాలతో పనిచేయని స్పష్టం చేశారు. ఓ సర్కిల్ ఇనస్పెక్టర్‌ని దగ్గర పెట్టుకుని రక్తం పడిన గదిని కడిగేశారని... ఆధారాలు చెరిపేశారని విమర్శించారు. వివేకా కుమార్తె ఫిర్యాదు చేసిన తర్వాత అప్పుడు గొడ్డలి పోటని ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. వివేకా హత్య ఘటనలో ఏమరుపాటుకు గురయ్యామని చెప్పుకొచ్చారు. కోడికత్తి డ్రామా, గులకరాయి డ్రామాలు ఆడారని విమర్శించారు. అలాంటి వాళ్లకు రాజకీయాలు చేసేందుకు అర్హత ఉందా..? అసలు వారికి పార్టీగా ఉండే అర్హత ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని అనుకుంటే ఎంతటి వారినైనా ఢీ కొంటానని స్పష్టం చేశారు. రాయలసీమ ఫ్యాక్షన్‌ను, హైదరాబాద్‌లో మత విద్వేషాలు, నక్సల్స్ సమస్యనూ అణచివేశానని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు.





అందుకే నక్సల్స్ అలిపిరిలో తనపై క్లైమోర్‌మైన్స్ పేల్చారని చెప్పుకొచ్చారు. నేరస్తులే రాజకీయ పార్టీ పెట్టి రాజకీయ అండతో నేరాలు చేస్తూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్నూలులో బస్సు దగ్ధం ఘటన జరిగితే అందులోనూ ఫేక్ ప్రచారాలకు తెరదీశారని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఒడిశాలో బస్సు రిజిస్ట్రేషన్ చేసి హైదరాబాద్ నుంచి బెంగుళూరు మధ్య నడుపుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రమాదం జరిగితే దానిపై కూడా ఫేక్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఫేక్ వ్యక్తులు దుష్ప్రచారం చేస్తుంటే ప్రతీ రోజూ చెప్పుకోవాలా..? అని ఆగ్రహించారు. వైసీపీకి ఓ పాంప్లెట్ ఉందని... ఓ ఛానల్ కూడా ఉందని... కానీ ఆ వ్యక్తులు బయటకు వచ్చి తమకు ఛానల్ లేదని, పేపర్ లేదని ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు.వాహనాల రిజిస్ట్రేషన్ల అంశంపైనా కేంద్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. పేపర్, ఛానల్ ద్వారా శవరాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మరో ఘటనలో కమ్మ కాపు మధ్య కుల విద్వేషాలు రగిల్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వాళ్లు నిద్రలేస్తే చాలు దుష్ప్రచారానికి తెగబడుతూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి రోజూ తమ ప్రభుత్వంపై బురద వేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇక ఏమాత్రం ఉపేక్షించబోనని... అడుగడుగునా సీసీ కెమెరాలు, ఆధారాలు ఉన్నాయని... అన్నిటినీ బయటపెడతామని హెచ్చరించారు. అమాయకులను మోసం చేస్తూ కులం, మతం, ప్రాంతం పేరుతో జగన్ అండ్ కో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధనవంతులకు జీవన విశ్రాంత సమయంలో కొత్త ఆశలు

ముందూ వెనుకా చూడకుండా సంపాదనే లక్ష్యంగా జీవితంలో చాలా భాగం గడిపిన తర్వాత చాలా మంది ధనవంతులకు జీవన విశ్రాంత సమయంలో కొత్త ఆశలు పుట్టుకొస్తాయి. వందల కోట్ల ఆస్తి ఉన్నా ఎక్కడా తన గురించి ప్రస్తావనే రావడం లేదేమీ అనే బెంగ మొదలవుతుంది. ఎలాగైనా తమ పేరు గొప్పగా మారుమోగిపోవాలనే దుగ్ధ వారిని నిలువనీయదు. ఎంత ఖర్చు అయినా పర్వా లేదు, తన పేరు నలుగురిలో నానాలి. యూ ఆర్ గ్రేట్ అని పొగడాలి. అందరిలో మంచి పేరు రావాలంటే సామాజిక సేవనే తగిన తోవ. ఆస్తిపరుడనే పేరు ఎలాగూ ఉంది, దానితోపాటు మంచివాడు, దయామయుడు, కరుణా హృదయుడు అనే ప్రచారం కావాలి. పుట్టినరోజు లాంటి పండుగల రోజున పేదలకు అన్న, వస్త్రదానాలు చేయాలి. అనాథాశ్రమాలకు వెళ్లి పిల్లలకు పండ్లు, స్వీట్లు పంచాలి. పత్రికల వారిని సాదరంగా ఆహ్వానించి ఆ వార్తలకు ప్రాధాన్యత తెచ్చుకోవాలి. సాహిత్యం, సంగీతం లాంటి లలిత కళలపై ఇష్టం, అభిమానం ఉన్నాయని చెబితే సాంస్కృతిక సంఘాలు వదిలిపెట్టవు. వారి కార్యక్రమాలకు స్పాన్సర్‌గా ఉంటే వ్యక్తిగత గౌరవంతో పాటు కోరినంత ప్రచారం లభిస్తుంది. అడగక ముందే కళాబంధు, డాక్టరేట్ అనే గౌరవాలు పేరు ముందు జత కడతాయి.

టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో గొప్పలు చెప్పుకోవడానికి కాలు కదిలించి సభలు, సమావేశాలకు వెళ్లే అవసరమే లేదు. ఇంటికే ఓ యూట్యూబర్‌ను రప్పించుకొని గంట వీడియో చేస్తే చాలు, చూసేవారి గుండెల్లో కొంతైనా చోటు లభిస్తుంది. మరో యూట్యూబర్‌తో మరో ముచ్చట. పాలు అమ్మి, పూలు అమ్మి.. కష్టపడి ఇంతవాడినైనానని అలా పెయిడ్ వీడియోలలో ఎన్ని కబుర్లైనా చెప్పుకోవచ్చు. ధనం కన్నా గుణమే గొప్పదని, డబ్బుతో అన్నింటిని కొనలేమని కొత్తగా తెలుసుకున్నట్లు ప్రజలకు



ఉపదేశం చేయొచ్చు. ప్రయివేటు ప్రాక్టీస్ ద్వారా కోట్లు గడించిన డాక్టర్లు ఆరోగ్య సూత్రాల పేరిట తమ జీవితంలోని విశేషాలను ఏకరువు పెడతారు. ప్రైవేటు విద్యా వ్యాపారం చేసి తరతరాలకు సరిపడే ఆస్తిని కూడబెట్టినవారు తాము దేశానికి ఎందరో ఇంజనీర్లను అందించామని గర్వంగా చెప్పుకుంటారు. ఫార్మా రంగంలో ఉంటే మందుల తయారీ ద్వారా కోట్లాది మందికి ప్రాణభిక్ష పెట్టామని చెప్తారు. కానీ వ్యర్థ రసాయనాలు నాలాల్లోకి వదిలి సర్వం విషతుల్యం చేస్తున్న విషయం దాచి పెడతారు. కనీస వేతన చట్టాన్ని కాలరాసిన పారిశ్రామికవేత్తలు కార్మికులను కన్నబిడ్డల్లా చేసుకున్నానని మన చెవుల్లో పువ్వులు పెట్టవచ్చు.

ప్రజల రక్తమాంసాలను పీల్చడానికి ప్రైవేటు విద్య, వైద్యం అనేవి పదునైన కోరలున్న వ్యాపార జాగిలాలు. వాటిలో కోట్లు కొల్లగొడుతూ ప్రజలకు గొప్ప మేలు చేస్తున్నట్లుగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు చేతి వైద్యం చేసేవారు తప్ప మెడిసిన్ చదివిన వారందరు ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసేవారు. జనాభా పెరిగి సర్కారు దవాఖానాలు సరిపోక ప్రైవేటు హాస్పిటళ్లు మొదలయ్యాయి. అలా సేవ పేరుతో వైద్య వృత్తి నిలువు దోపిడీకి సెంటర్ అయింది. కాలక్రమంగా మెడిసిన్ చదవడమే సొంత ప్రాక్టీస్ కోసం అన్నట్లు మారిపోయింది. వీలయినంత త్వరగా ఓ భారీ భవంతి కట్టేసి కార్పొరేట్ స్థాయికి మారిపోవాలనేదే నేటి డాక్టర్ల కల. వృత్తిలో పైకెదగడం మంచిదే కానీ, ఎదగడమే లక్ష్యంగా జనాన్ని మోసం చేయకూడదు. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టకూడదు. వృత్తి నైతికతకు భంగం రానీయవద్దు. వీటిని పాటిస్తే గుట్టలుగా ధనం పేరుకుపోయి అవకాశమే లేదు. చాలా చోట్ల యాభై, వంద రూపాయల ఫీజుతో నలభై, యాభై ఏళ్లుగా ప్రాక్టీస్‌చేస్తున్న డాక్టర్లు ఉన్నారు. వారికి వృత్తి ధర్మం తప్ప ప్రచారం అక్కరలేదు. అదీ నిజమైన జీవన సాఫల్యం. అయితే వీరివైపు ప్రభుత్వాలు కన్నెత్తి చూడవు. నగరాల్లోని ఖరీదైన ప్రాంతాల్లో తమ కార్పొరేట్ వైద్యశాలలు విస్తరిస్తున్న డాక్టర్ల మెడలో పద్మ పతకాలు అలరిస్తుంటాయి. ప్రభుత్వాలు, పత్రికలు, సంస్థలు అన్ని ఈ ఢాంబిక జీవితానికే గుర్తింపునిస్తున్నాయి.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి అందరూ ముందుకు రావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాకారం కావాలని కోరుతూ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బాపు ఘాట్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ నేతల ప్రార్థనలు & పూజ్య బాపూజీ స్మృతి భజన కార్యక్రమం
- అసెంబ్లీలో పాస్ అయిన బీసీ రిజర్వేషన్ల బిల్లును బాపూజీ ఘాట్ పై పెట్టి ప్రార్థనలు చేసిన నేతలు
- బాపు ఘాట్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయ ప్రకాష్, బాల లక్ష్మీ ,ఇతర ముఖ్య నేతలు

హైదరాబాద్: బాపు ఘాట్ దగ్గర తెలంగాణ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో గాంధీజీ ఆలోచన విధానం మేరకు శాంతియుతంగా ఇక్కడ కార్యక్రమం చేపట్టడం జరిగింది. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేలా అందరి మనసులు మారాలని ఇక్కడ ప్రార్థనలు చేయడం జరిగింది. మహాత్మా గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం చట్ట పరంగా ,న్యాయ పరంగా చేయాల్సినవి చేసి గవర్నర్ ద్వారా ఢిల్లీకి పంపించడం జరిగింది

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనులు ఏ విధంగా ఉద్యమం చేశారో, ఇప్పుడు కూడా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి సకలజనులు ఇటీవల ఐక్యంగా బంద్ నిర్వహించి కార్యాచరణ



తీసుకోవడం జరిగింది. శివుని పటంలో పాము , నంది , నెమలి, ఎలుక వీటన్నిటికి ఒకదానికి ఒకటి పడవు. కానీ శివుడి దగ్గర కలిసి ఉంటాయి.

ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి అందరూ ముందుకు రావాలి. అన్ని రాజకీయ పార్టీలుగా వ్యక్తులుగా ,ప్రజా ప్రతినిధులు గా ,రాజకీయ నాయకులుగా వేరు. ఈ కార్యాచరణ సాధించడానికి అందరూ ఐక్యంగా అన్ని వర్గాలు మనం రిజర్వేషన్లు సాధించుకోవాలి.

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో 42 శాతం రిజర్వేషన్లు రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు పోతున్నాం. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశానికి రోల్ మోడల్‌గా ఉండాలి

# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

- జనం బాట పూర్తైన తర్వాత మా కార్యాచరణ ప్రకటిస్తాం
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాకు ఎలాంటి స్టాండ్ లేదు
- ఇప్పుడు నేను ఫ్రీ బర్డ్‌ని
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

కరీంనగర్: రాష్ట్రంలో కచ్చితంగా రాజకీయ శూన్యత ఉంది. మా ప్రాధాన్యం ప్రజల సమస్యలు తీర్చటమే. మేము ప్రజల గొంతుకగా మారుతాం. ఇప్పుడు ప్రధాన పార్టీలన్నీ జూబ్లీహిల్స్ ఎన్నికలో బిజీగా ఉన్నారు. మొంథా తుపానుతో రైతులు నష్టపోయిన పట్టించుకుంట లేరు. వరంగల్ నగరమంతా నీటిలో మునిగితే పోరాటం చేయాల్సి పార్టీలు పట్టించుకుంట లేవు.

జాగృతి రాజకీయ వేదికే. మేము చాలా సందర్భాల్లో రాజకీయాలు మాట్లాడాం. జాగృతి ది తెలంగాణ లైన్. మేము ప్రజలకోసమే పోరాడుతాం. మోడీ కార్మికుల హక్కులను కాలరాస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు చేయాల్సినంత పోరాటం చేయలేదు. రైతు చట్టాల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ, లేబర్ చట్టాల గురించి మాట్లాడలేదు. మోడీ కారణంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఇంకా రెండు నెలల సమయం కోరుతున్నారు. అంటే వాళ్లు ఈ విషయాన్నిఇంకా సాగదీసే ప్రయత్నంలో ఉన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మాకు ఎలాంటి స్టాండ్ లేదు. ఫీజు రీయింబర్స్ మెంట్ కు సంబంధించి మండలిలో లో నేను మాట్లాడితేనే సీఎం 700 కోట్లు ఇచ్చారు. ప్రతి నెల నిధులు విడుదల చేస్తామని చెప్పి చేయటం లేదు.

ఏపీకి 23 మంది సీఎంలు అయితే ఒక్క బీసీ గానీ, మహిళ గానీ ఎందుకు సీఎం కాలేదు? నా రాజీనామాను యాక్సెప్ట్ చేయమని నేను కోరాను. నా రాజీనామా యాక్సెప్ట్ చేస్తే ఆరు నెలల లోపు ఎమ్మెల్సీని చేయాలి అనేది వారి ఆలోచన కావొచ్చు. ఛైర్మన్ నా రాజీనామా పై నాతో కాకుండా చిట్ చాట్ లో మాట్లాడుతున్నారు. మరొక సారి ఆయనతో మాట్లాడి రాజీనామా యాక్సెప్ట్ చేయమని కోరుతా.



నన్ను వారి బాణం, వీరి బాణం అని అంటున్నారు. కానీ నేను తెలంగాణ ప్రజల బాణాన్ని. వీలైనంత తొందరగా సామాజిక తెలంగాణ, బీసీ రిజర్వేషన్లు పూర్తి కావాలని కోరుకుంటున్నా. నియోజకవర్గాల పునర్విభజనతో మహిళలకు మేలు జరుగుతుంది. తెలంగాణలో 69 మంది మహిళ ఎమ్మెల్యేలు అవుతారు.

ఇంకా ఎన్నాళ్లు ఇతర దేశాలలో ఉద్యోగాల కోసం వెళ్తాం. అమెరికా, దుబాయ్ వాళ్లు మనల్ని వెళ్లగొడుతున్నారు. మనం ఉన్నచోట ఉద్యోగాలు లేవు. ఇప్పుడు విప్లవాత్మక మార్పు రావాల్సిన అవసరముంది. నేను, హరికృష్ణ అనే అధికారి కృషి చేస్తే తెలుగుకు ప్రాచీన హోదా వచ్చింది. తెలుగుకు ప్రాచీన హోదా కోసం కొట్లాడినం, ఆరాట పడ్డం. గతంలో నేను ఏమీ అనలేని బంధనాలు ఉండేవి. ఇప్పుడు నేను ఫ్రీ బర్డ్ ని.

ఇక్కడ ఏర్పాటు చేసిన ఐటీ టవర్ లో కంపెనీలు పారిపోయాయి. మంత్రి శ్రీధర్ బాబు దీనిపై దృష్టి పెట్టాలి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఏమీ పట్టించుకోవటం లేదు. ఆర్టీసీ లో చిన్న చిన్న కారణాలకే 11 వందల మందిని తీసేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ 3 వందల మంది కార్మికులను తీసేశారు. వారంతా రోడ్డున పడ్డారు. వారిని మళ్లీ రిక్రూట్ చేసుకోవాలి. జూబ్లీహిల్స్ ఎన్నిక రావటంతో ఎమర్జెన్సీగా మైనార్టీకి మంత్రి పదవి ఇచ్చారు. అదే ఎమర్జెన్సీ లో మైనార్టీ ల కోసం ఏటా 2 వేల కోట్లు ఖర్చు చేయాలి. అంతే ఎమర్జెన్సీగా మైనార్టీ రిజర్వేషన్లు అమలు చేయాలి.

# 83 క్రిమినల్ కేసుల రేవంత్ సీఎం ఉంటే రౌడీలు ఇలాగే రెచ్చి పోతారు..

- బాబా ఫసీయుద్దీన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి
- సీతక్క, ఎంపి మల్లు రవి, రేవంత్‌తో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు
- ఫసీయుద్దీన్ బయట ఉంటే బోరబండలో ఎన్నికలు సజావుగా సాగవు
- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

హైదరాబాద్: బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్ బిఆర్ఎస్ ఎమ్మెల్సి శంభీపూర్ రాజు మరియు స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించిన సర్దార్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ రోజు బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ను కలిశారు.

ఈ సందర్భంగా డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏమన్నారంటే.. బాబా ఫసీయుద్దీన్ ను వెంటనే అరెస్ట్ చేయాలి. ఆయన వేధింపుల వల్ల సర్దార్ అనే వ్యక్తి బిల్డింగ్ మూడో ఫ్లోర్ నుండి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చనిపోయి 5 నెలలు దాటినా ఇప్పటికీ పోలీసు విచారణ పూర్తి కాలేదు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల నుండి స్టేట్ మెంట్ రికార్డు చేసిన తర్వాత కూడా ఇప్పటికీ నిందితుడిని అరెస్ట్ చేయలేదు.

బాబా ఫసీయుద్దీన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క, ఎంపి మల్లు రవి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ మీటింగ్ లకు రాకపోతే, సర్దార్ కు పట్టిన గతే మీకు కూడా పడుతుందని అందరినీ బెదిరిస్తున్నారు.

నా మీద ఎన్ని కేసులు పెట్టినా నన్ను ఏం చేయలేరంటూ



మాట్లాడుతున్నారు. ఫోన్‌లో బెదిరించినా రికార్డింగ్ ఉన్నా, 5 నెలలుగా పోలీసులు ఏమీ చేయడం లేదు. 83 క్రిమినల్ కేసులు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే రౌడీలు ఇలాగే రెచ్చి పోతారు. పైగా నిందితునికి ప్రభుత్వం గన్ మెన్లను ఇచ్చింది. బాబా ఫసీయుద్దీన్ ఆగడాలు దారుణంగా ఉన్నాయి. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. గంజాయి బకెట్లు ఇంట్లో పెట్టి అక్రమ కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారు. రైతులకు న్యాయం చేయాలని సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తే, కేసు పెట్టి నల్ల బాలు,దిలీప్,కొణతం,గౌతమ్ లను అరెస్ట్ చేసిన పోలీసులకు బాబా ఫసీయుద్దీన్ మాత్రం దొరకడం లేదు.

కనీసం అతన్ని అరెస్ట్ చేయడం లేదు, బైండోవర్ చేయడం లేదు, కనీసం పోలీస్ స్టేషన్ పిలిపించడం లేదు. బాబా ఫసీయుద్దీన్ బయట ఉంటే బోరబండలో ఎన్నికలు సజావుగా సాగవు. అందుకే అతన్ని అరెస్ట్ చేసి,రౌడీ షీట్ ఓపెన్ చేయాలి,పిడి యాక్ట్ పెట్టి బైండోవర్ చేసి జైలుకు పంపించాలి. బాబా ఫసీయుద్దీన్ కు గన్ మెన్ల ను ఇవ్వడం పై ఎన్నికల కమీషన్, హైదరాబాద్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ను కూడా కలుస్తాం.

# మోదీకి గిరిజన వర్గాలపై ప్రత్యేకమైన అనుబంధం, గౌరవం

- బిజెపి ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యశాలలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్: గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నవంబర్ 9 నుండి 16 వరకు దేశవ్యాప్తంగా "జనజాతీయ గౌరవ్ దివస్" వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యశాలలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. ఈ సమావేశానికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఏమన్నారంటే.. భగవాన్ బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు. బ్రిటిష్ వలసవాదంపై తిరుగుబాటు చేసి, గిరిజన సమాజానికి ఆరాధ్యదైవంగా నిలిచారు. ఆయన పోరాట స్ఫూర్తి మన అందరికీ స్ఫూర్తిదాయకం.

గతంలో విస్మరించబడిన గిరిజన సమాజం, వారి గొప్ప సాంస్కృతిక వారసత్వం, కృషిని గుర్తిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతి సంవత్సరం జనజాతీయ గౌరవ్ దివస్‌ను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మోదీకి గిరిజన వర్గాలపై ప్రత్యేకమైన అనుబంధం, గౌరవం ఉంది. వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు.

ప్రధానమంత్రి మోదీ గిరిజన నాయకులు, కళలు, సంస్కృతులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు కృషి చేస్తూ, ప్రపంచ నాయకులకు గిరిజన కళాఖండాలను అందించడం ద్వారా భారత గిరిజన సంస్కృతుల పట్ల ప్రపంచవ్యాప్తంగా గౌరవం పెంచారు.



కార్యశాలలో బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ , జిల్లా ఇంచార్జీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మూడో టీ20లో విజయంపై భారత్ కసరత్తు

- టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు?
- వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే ఛాన్స్
- అర్షదీప్ సింగ్‌ను ఆడించే అవకాశం
- హర్షిత్ రాణా, కుల్దీప్ పై వేటు పడే చాన్స్

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లోనూ వెనుకంజలో నిలిచిన టీమిండియా మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. హొబర్ట్ వేదికగా ఆదివారం జరిగే మూడో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇరు జట్ల మధ్య తొలి టీ20 వర్షార్పణం కాగా.. రెండో టీ20లో ఆసీస్ 4 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చెత్త బ్యాటింగ్ భారత్ 125 పరుగులే చేయగా.. ఆసీస్ మరో 40 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.పరిస్థితులు అంచనా



వేయకుండా దూకుడుగా ఆడటం టీమిండియాకు నష్టం చేసింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోవడంతో కోలుకోలేకపోయింది. ఈ క్రమంలోనే మూడో టీ20లో విజయం సాధించి సిరీస్ రేసులో నిలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. మరోవైపు ఆస్ట్రేలియా మాత్రం మూడో టీ20 కూడా గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలనుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.రెండో టీ20 ఓటమి నేపథ్యంలో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా టాప్ టీ20 బౌలర్ అర్షదీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను తొలి రెండు టీ20లు ఆడించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. బ్యాటింగ్ డెప్త్ కోసం హర్షిత్ రాణాను ఆడించిన టీమిండియా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రెండో టీ20లో హర్షిత్ రాణా బ్యాట్‌తో రాణించినా బౌలింగ్‌లో తేలిపోయాడు. ఈ క్రమంలో హర్షిత్ రాణాను తప్పించి అతని స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే ఛాన్స్ ఉంది.రెండో టీ20లో ధారళంగా పరుగులిచ్చిన కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అర్షదీప్ సింగ్‌ను ఆడించవచ్చు. పిచ్‌లు పేస్, బౌన్స్‌కు అనుకూలంగా ఉండటంతో ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లు అవసరం లేదనే అభిప్రాయం కలుగుతోంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సత్తా చాటుతుండటంతో కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కు పరిమితం చేయడమే ఉత్తమమనిపిస్తుంది. ఒకవేళ కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణా స్థానంలో అర్షదీప్ సింగ్ బరిలోకి దిగుతాడు.బ్యాటింగ్‌లో విఫలమైనా పెద్దగా మార్పులు చేసే అవకాశం లేదు. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. రెండో టీ20లో బ్యాటర్లంతా విఫలమైన వేళ అభిషేక్ శర్మ ఒంటరి పోరాటం చేశాడు. శుభ్‌మన్ గిల్ కూడా చెలరేగాల్సి ఉంది. ఈ ఇద్దరూ పవర్ ప్లే పూర్తయ్యే వరకు క్రీజులో ఉంటే టీమిండియాకు తిరుగుండదు.మూడో స్థానంలో బరిలోకి దిగిన సంజూ శాంసన్ తీవ్రంగా నిరాశపర్చాడు. అతను తన సత్తా చాటాల్సిన అవసరం ఉంది. తొలి టీ20లో చెలరేగిన సూర్యకుమార్ యాదవ్.. రెండో టీ20లో మాత్రం రాణించలేకపోయాడు. అతను కూడా సత్తా చాటాల్సి ఉంది. తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ కూడా చెలరేగాల్సి ఉంది. స్పెషలిస్ట్ పేసర్‌గా బుమ్రా సత్తా చాటగా అతనికి అర్షదీప్ సింగ్ అండగా నిలవనున్నాడు.

### ఆస్ట్రేలియాతో మూడో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్/హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్/అర్షదీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా

# ప్రపంచ కప్ ఫైనల్ విజేతగా నిలిచేనా!?

### ఓపెనింగ్ జోడీపైనే అందరి దృష్టి

మహిళల ప్రపంచ కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు, దక్షిణాఫ్రికా జట్టు మధ్య డివై పాటిల్ స్టేడియంలో తలపడనున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీమిండియా సెమీ-ఫైనల్‌లో చరిత్ర సృష్టించి ఫైనల్‌కు చేరుకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 339 పరుగుల టార్గెట్ ఛేదించి టైటిల్ రేసులోకి వచ్చింది. మహిళల వన్డే చరిత్రలో ఇది అతిపెద్ద రన్ ఛేజింగ్. 7 సార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించి భారత మహిళల జట్టు 3వసారి వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికా జట్టు తొలిసారిగా ఫైనల్ చేరింది. టైటిల్ మ్యాచ్‌లో డివై పాటిల్ స్టేడియం పిచ్ రిపోర్ట్ కీలకం కానుంది. రెండు జట్ల ప్లేయింగ్ 11 మరియు మ్యాచ్ ప్రిడిక్షన్ వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. సెమీఫైనల్‌లో స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 127 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించింది. ఫైనల్‌లో కూడా మంధాన, హర్మన్ ప్రీత్, జెమీమా నుంచి ఈ తరహా ప్రదర్శనను ఆశిస్తున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ టోర్నమెంట్‌లో రెండు, మూడు మ్యాచ్ లలో కీలక ఇన్నింగ్స్ ఆడినా జట్టు ఓటమిపాలైంది. కానీ ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌లో 89 పరుగులు చేసి ఆకట్టుకుంది. ప్రతీకా రావల్ గాయంతో మరో ఓపెనర్ షెఫాలీ వర్మ భారత జట్టులోకి వచ్చింది. అయితే సెమీఫైనల్‌లో ఆమె కేవలం 10 పరుగులు చేసింది. ఫైనల్‌లో గెలవాలంటే షెఫాలీ, మరో ఓపెనర్ స్మృతి మంధానా మంచి ఓపెనింగ్ ఇవ్వడం చాలా ముఖ్యం. వీరిద్దరూ ఎటాకింగ్ బ్యాటింగ్ తో మొదలుపెట్టాలని అంతా ఆశిస్తున్నారు.దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ బ్యాటింగ్ ఇన్నింగ్స్ ప్రారంభించనుంది. మొదట్లోనే భారత బౌలర్లు ఆమెను కట్టడి చేయాలి. లేకపోతే ఆమె సమస్యగా మారవచ్చు. సెమీఫైనల్‌లో ఆమె 169 పరుగులు చేసి చరిత్ర సృష్టించింది. రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ మొట్లోనే సఫారీల వికెట్లు తీస్తే ప్రయోజనం ఉంటుంది.నల్లపురెడ్డి చరణి పరుగులు నియంత్రించడంలో సక్సెస్ అవుతోంది. దీప్తి శర్మ సెమీఫైనల్‌లో ఎక్కువ పరుగులు ఇచ్చింది. కానీ టోర్నమెంట్‌లో ఆమె ఆల్ రౌండ్ ప్రదర్శనలో రాణించింది. డివై పాటిల్ స్టేడియం పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. కనుక ఫైనల్‌లో హై స్కోరింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. ఇక్కడ ఫాస్ట్ బౌలర్ల కంటే స్పిన్నర్లకు ఎక్కువ అనుకూలం. టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకోవచ్చు. మ్యాచ్ రోజు వర్షం పడే అవకాశం ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో సగటు స్కోరు 220. వాతావరణం విషయానికి వస్తే ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు 25 శాతం వర్షం పడే అవకాశం ఉంది. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచనున్నాయి. ఈసారి కొత్త ప్రపంచ ఛాంపియన్ జట్టును చూడనున్నాం. ఇరు జట్లు ఇప్పటివరకు ఒక్క టైటిల్ గెలవలేదు. హర్మన్‌ప్రీత్ కౌర్ అండ్ టీమ్ టైటిల్ గెలిచే అవకాశం 70 శాతం కంటే ఎక్కువ. భారత్ సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఇదే స్టేడియంలో ఓడించింది. హర్మన్‌ప్రీత్, జెమీమా అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. హెడ్ టు హెడ్ గణాంకాల్లో భారత్ ముందంజలో ఉంది. అయితే దక్షిణాఫ్రికాపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఆ జట్టు తొలిసారిగా ఫైనల్ ఆడుతోంది. దాంతో భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ ఛాంపియన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.మహిళల ప్రపంచ కప్ 2025 ఫైనల్ నవంబర్ 2న డివై పాటిల్ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు స్టార్ట్ అవుతుంది. టాస్ 2:30 గంటలకు వేస్తారు. మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌లో, లైవ్ స్ట్రీమింగ్ జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో




ఉంటుంది.

క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఎంత పవర్‌ఫుల్ జట్టో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పురుషుల క్రికెట్ అయినా.. మహిళల్లో అయినా ఆస్ట్రేలియా జట్టుకు తిరుగు లేదు. పురుషుల క్రికెట్‌లో ఐసీసీ టైటిళ్లన్నీ గెలవడంతో పాటు అత్యధిక ట్రోఫీలు అందుకున్న ఏకైక టీమ్‌గా ఆసీస్ చరిత్ర సృష్టించింది. ఏకంగా 6 వన్డే ప్రపంచకప్(1987, 1999, 2003, 2007, 2015, 2023)ట్రోఫీలను గెలుచుకున్న ఆస్ట్రేలియా.. ఒక టీ20 ప్రపంచకప్ (2021), వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(2023), రెండు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ(2006, 2009), ఐసీసీ సూపర్ సిరీస్(2005)తో మొత్తం 11 టైటిళ్లను అందుకుంది.ఆస్ట్రేలియా మహిళల జట్టు 13 సార్లు ఐసీసీ టైటిల్స్ అందుకుంది. వన్డే ప్రపంచకప్‌ను(1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) ఏడు సార్లు గెలిచిన ఆసీస్ మహిళల టీమ్.. 6 సార్లు(2010, 2012, 2014, 2018, 2020, 2023) టీ20 ప్రపంచకప్ గెలుచుకుంది. ఇంత ఘనమైన రికార్డ్ ఉన్న ఆస్ట్రేలియా జట్లు గత రెండేళ్లుగా ఐసీసీ టైటిల్ అందుకునేందుకు తడబడుతున్నాయి.భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీని చివరి సారిగా ఆస్ట్రేలియా పురుషుల జట్టు గెలవగా.. మహిళల టీమ్ అదే ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత ఐదు ఐసీసీ టోర్నీల్లో ఆస్ట్రేలియా జట్లు బరిలోకి దిగగా.. ఒక్క టోర్నీ కూడా గెలవలేకపోయింది. అయితే ఆసీస్‌కు టైటిల్ శాపం తగలిందని, దాంతో ట్రోఫీని గెలవలేకపోతుందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. పురుషుల వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆసీస్ స్టార్ బ్యాటర్ మిచెల్ మార్ష్ ట్రోఫీపై కాలు పెట్టి దిగిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. అప్పట్లో ఈ ఫొటోపై తీవ్ర విమర్శలు వచ్చాయి. టైటిల్ కాళ్లు పెట్టడం ఏంటని నెటిజన్లు మండిపడ్డారు. కాళ్లు పెట్టి ట్రోఫీని అవమానించడంతోనే ఆ జట్టుకు మరో ట్రోఫీ దక్కడం లేదని తాజాగా నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఈ టోర్నీ తర్వాత జరిగిన టీ20 ప్రపంచకప్ 2024లో ఆస్ట్రేలియా లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీఫైనల్లో ఓటమిపాలైంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికా చేతిలో ఖంగుతిన్నది. తాజాగా మహిళల వన్డే ప్రపంచకప్ 2025 సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓడింది. సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను చేజార్చుకుంది. 339 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయిన ఆసీస్.. మూడు ఈజీ క్యాచ్‌లను వదిలేసింది. ఫీల్డింగ్‌కు పెట్టింది పేరు అయిన ఆసీస్.. క్యాచ్‌లు వదిలేయడంతో నెటిజన్లు అవాక్కయ్యారు. ట్రోఫీపై కాలుపెట్టిన పాపమే ఆసీస్‌ను వెంటాడుతుందని అభిప్రాయపడుతున్నారు.

### భారత జట్టు యొక్క ప్లేయింగ్ 11 (అంచనా)

షెఫాలీ వర్మ, స్మృతి మంధానా, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, క్రాంతి గౌడ్, నల్లపురెడ్డి చరణి, రేణుకా సింగ్.





# సల్మాన్‌తో దిల్‌రాజ్ మూవీ?

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మరోసారి భారీ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌తో పాటు దిల్ రాజు డ్రీమ్స్ అనే కొత్త విభాగం ద్వారా యంగ్ టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల 'గేమ్ ఛేంజర్' ,'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి ప్యాన్-ఇండియా స్థాయిలో ప్రాజెక్ట్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో పలు బడా హీరోలతో సినిమాలు తెరకెక్కించే ప్రణాళికలో ఉన్న ఆయన, ఈసారి బాలీవుడ్ వైపు దృష్టి సారించారు.

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో భారీ చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నారని వినికిడి. వీరిద్దరి కాంబినేషన్‌లో క్లాస్ టచ్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని టాక్. ఇప్పటికే సల్మాన్ ఖాన్ స్క్రిప్ట్‌ను విని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక, టెక్నీషియన్ల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక సల్మాన్ రెమ్యునరేషన్ విషయానికి వస్తే .. ఈసారి లాభాల్లో వాటా తీసుకోవడానికి అంగీకరించారని వార్తలు వస్తున్నాయి.

దిల్ రాజు ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మించాలనుకుంటున్నారని, సినిమాని ప్యాన్-ఇండియా లెవెల్‌లో విడుదల చేయాలనే లక్ష్యంతో ఉన్నారని టాక్. గతంలో 'హిట్', 'జెర్సీ' వంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న దిల్ రాజు, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి మళ్లీ బాలీవుడ్ మార్కెట్‌లో తన ముద్ర వేయడానికి రెడీ అవుతున్నారు.



# విడుదలకు రెడీగా ఆంధ్ర కింగ్ తాలూకా

ఈ నెలాఖరున 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన.. భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి. మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలోని చిన్ని గుండెలో అంటూ సాగే మెలోడీ గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాటకు వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. మెర్విన్ సోలమన్, సత్య యామిని ఆలపించారు.

ఈ పాటలో రామ్ - భాగ్యశ్రీల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. దీన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దానికి ఒకరోజు ముందుగానే ఈ నెల 27న తెరపైకి తీసుకొచ్చేందుకు నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.

## కథ పాతదే అయినా..జాతర కొత్తది



ఖాకీ కథలు రవితేజకు బాగా అచ్చొచ్చిన జానర్. 'క్రాక్', 'పవర్', 'విక్రమార్కుడు'.. ఇలా ఆయన కెరీర్‌లో పోలీస్ కథలతో కొట్టిన హిట్లు అనేకం. ఇప్పుడాయన 'మాస్ జాతర' కోసం రైల్వే పోలీస్‌గా మారారు.

లక్ష్మణ్ భేరి (రవితేజ) నిజాయితీ గల రైల్వే పోలీస్. తన కళ్ల ఎదురుగా అన్యాయం జరిగితే.. అది తన పరిధిలోనిది కాకున్నా దాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మరీ న్యాయం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వరంగల్‌లో పని చేసే సమయంలో ఓ మంత్రి కొడుక్కి తనదైన శైలిలో బుద్ధి చెప్తాడు. ఆ తర్వాత తను అల్లూరి జిల్లాలోని అడవివరం రైల్వే స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతాడు. కొండల మధ్య ఉండే గిరిజన ప్రాంతాన్ని శివుడు (నవీన్ చంద్ర) శాసిస్తుంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులతో శీలావతి రకం గంజాయిని పండించి.. దాన్ని కోల్‌కతాకు స్మగ్లింగ్ చేస్తుంటాడు. లక్ష్మణ్ ఆ ఊర్లోకి అడుగు పెట్టడంతోనే శివుడికి ఎదురు వెళ్లడం మొదలు పెడతాడు. జిల్లా ఎస్పీ నుంచి మొదలు.. మొత్తం రాజకీయ వ్యవస్థ అండగా ఉన్న శివుడ్ని ఓ మామూలు రైల్వే ఎస్సై ఎలా అడ్డుకున్నాడు? అతని గంజాయి సామ్రాజ్యాన్ని ఎలా కూలదోశాడు?ఈ కథలో తులసి (శ్రీలీల), హనుమాన్ భేరి (రాజేంద్ర ప్రసాద్)ల పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ.

కొత్త దర్శకులు అగ్రతారలతో జట్టు కట్టారంటే చాలు సినీప్రియుల్లో, అభిమానుల్లో ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. తమ అభిమాన కథానాయకుడ్ని ఎంత కొత్తగా తెరపై చూపిస్తారు..? అతనితో ఎలాంటి వినూత్నమైన కథ చెప్పిస్తారనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంటుంది. ఈ అంచనాల్ని దృష్టిలో పెట్టుకునే దర్శకుడు భాను భోగవరపు దీంట్లో రవితేజ పాత్రను వింటేజ్ ఎనర్జీతో పవర్‌ఫుల్‌గా తెరపై ఆవిష్కరించారు. రవితేజ నుంచి కోరుకునే ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ యాక్షన్ అంశాల్ని మేళవిస్తూనే ఆయన ఒకప్పటి బెంచ్ మార్క్ హిట్స్‌ను గుర్తు చేసుకునేలా కొన్ని హైమూమెంట్స్‌ను అందించే ప్రయత్నం చేశారు. అయితే కథలో కొత్తదనం కనిపించలేదు. రవితేజ ఇప్పటికే ఇలాంటి రొటీన్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చాలా చేసేశాడు కదా అని ప్రేక్షకుడికి అనిపిస్తుంది. రవితేజలోని హైఎనర్జీని రుచి చూపిస్తూ మంచి యాక్షన్ సీక్వెన్స్‌తో ఆయన పాత్రను తెరకు పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ఆ వెంటనే తన కుటుంబ నేపథ్యాన్ని.. తాతతో ఉన్న అనుబంధాన్ని.. పెళ్లి కాకపోవడానికి వెనకున్న కారణాల్ని ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశారు. శివుడిగా నవీన్‌చంద్ర విలనిజాన్ని.. తన గంజాయి స్మగ్లింగ్ దందాను పరిచయం చేస్తూ కథలో సంఘర్షణకు బీజం వేసిన విధానం ఫర్వాలేదనిపిస్తుంది. హీరో అడవివరంకి ట్రాన్స్‌ఫర్ అవడం.. అక్కడ తనకు శివుడి గ్యాంగ్‌కు మధ్య జరిగే చిన్నపాటి గొడవలతో కథ కాస్త వేగం పుంజుకుంటుంది. శివుడు గంజాయి స్మగ్లింగ్ కోసం రైల్వేని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకోవడం.. దాన్ని అడ్డుకునేందుకు హీరో రంగంలోకి దిగడంతో అసలు కథ మొదలవుతుంది. ఈ క్రమంలో ఊరి ప్రజలతో హీరో చేసే యాక్షన్ సీక్వెన్స్ థ్రిల్ పంచుతుంది.

## ఆదిసాయి కుమార్ శంబాల ట్రైలర్ విడుదల



ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'శంబాల'. మిస్టికల్ థ్రిల్లర్‌గా.. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. అర్చన అయ్యర్, శ్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ ముఖ్యపాత్రల్ని పోషించారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన యుద్ధమే ఈ కథకు మూలం అంటూ సాయికుమార్ వాయిస్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇది సైన్స్ ఊహకు అందనిది అనే డైలాగులు ఆసక్తి కలిగిస్తున్నాయి.

# పెద్ది మూవీలో జాన్వీ లుక్స్ అదుర్స్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగు తోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మాఅనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్చి 27న విడుదల కానుంది. ' ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నెల 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సెర్ట్‌లోనే ఈ చిత్ర తొలి గీతాన్ని వినిపిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సామాజిక మాధ్యమాల వేదికగా సంకేతాలు అందించారు. ఆటలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. దీనికి రెహమాన్ సంగీతమందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



## రోషన్ ఛాంపియన్ టీజర్ విడుదల

నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛాంపియన్' స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. స్పోర్ట్స్ నేపథ్యంలో సాగనున్న ఈ సినిమాలో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపిస్తున్నారు. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్' టీజర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రోషన్, అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేయగా, తాజాగా రిలీజైన టీజర్ సినిమా స్థాయిని పెంచింది. 'ఛాంపియన్' కథ స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్‌లో నివసించే ఆర్మీ మాన్, ఫుట్‌బాలర్ అయిన మైఖేల్ సీ. విలియమ్స్ చుట్టూ తిరుగుతుంది. మైదానంలో ప్రత్యర్థులను సవాలు చేస్తూ తన ప్రతిభను ప్రదర్శించే ఈ యంగ్‌మ్యాన్‌కి ఇంగ్లండ్‌లో రాణి ఎలిజబెత్‌ను కలుసుకునే అవకాశం దక్కుతుంది. దేశం కోసం ఆడే అవకాశమొచ్చినా, అతని మనసు మాత్రం తన ప్రేయసి వద్దే ఉంటుంది. కానీ జీవితం అతనికి సవాళ్లు, భావోద్వేగాలు, యుద్ధం, ప్రేమ అన్నీ ఒకేసారి ఎదురుచూపిస్తుంది. ఫుట్‌బాలర్‌గా రోషన్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించాడు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154